Follow: @ANNTELUGU
ANN తెలుగు
# మహా పత్రిక
03-01-2025
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 33 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రేవంత్ రెడ్డి పాన్ ఇండియా సీఎం అయ్యారు: ఎంపీ చామల

**కేటీఆర్ తప్పు చేశారు**

అందుకే పూటకో మాట మాట్లాడుతున్నారు

ట్రిపుల్ ఆర్ పై కేటీఆర్ వి పిచ్చి మాటలు

ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి షాకింగ్ కామెంట్స్

**హైదరాబాద్, మహా :** పాన్ ఇండియా స్టార్ పుష్ప (అల్లు అర్జున్) అరెస్ట్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాన్ ఇండియా నాయకుడు అయ్యారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కొందరు ముఖ్యమంత్రులు అవినీతి చేసి అందరికీ తెలిస్తే, సీఎం రేవంత్ సాహసోపేత నిర్ణయాలు తీసుకొని అందరికీ తెలిశారన్నారు.

వివరాలు 2లో

## రేవంత్ రెడ్డి... కేసీఆర్ మార్గంలో నడవక తప్పదు



- కేపీ వివేకానంద
- మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రో పొడిగింపు ప్రజల విజయమని వ్యాఖ్య
- రాయదుర్గం-శంషాబాద్ మార్గం పనులను తిరిగి ప్రారంభించాలని డిమాండ్

03


## కుంభకోణాలు బయటపెడతా



- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- రాష్ట్ర రైతాంగం మీద కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు చెప్పాలి
- గడిచిన ఏడాదంతా మోసాలే

03

## కేసీఆర్ ఫ్యామిలీ జైలుకే



- కల్వకుంట్ల కేసీఆర్ కుటుంబమంతా జైలులో ఊచలు లెక్కించాల్సిందే
- రేపోమాపో కేటీఆర్ జైలుకు వెళ్ళబోతున్నారు
- కడియం శ్రీహరి హాట్ కామెంట్స్

03



# తెలంగాణ మద్యంపై ఆంధ్ర ఎఫెక్ట్..!

### 650 కోట్ల రూపాయల మేరకు తగ్గిన అమ్మకాలు

సరిహద్దుల్లో వెలవెలబోయిన మద్యం షాపులు

కొత్త బ్రాండ్లపై ఎక్సైజ్ శాఖ కుస్తీ

**ఖమ్మం, జనవరి 2, మహా:** తెలంగాణలో మద్యం అమ్మకాలపై ఆంధ్ర ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ కూటమి సర్కార్ తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీ తెలంగాణ మద్యం మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపించింది. సరిహద్దు ప్రాంతాలలో మద్యం విక్రయాలు అధికంగా ఉండటంతో, ఆంధ్రతెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న వైన్ షాపుల వద్ద పాపులారిటీ తగ్గిపోవడంతో వ్యాపారులు ప్రభావితమయ్యారు. గత సంవత్సరంతో పోలిస్తే, 2024 డిసెంబరులో తెలంగాణలో మద్యం విక్రయాలు సుమారు 650 కోట్ల రూపాయల మేర తగ్గాయి.


**ఆంధ్రప్రదేశ్ కొత్త మద్యం పాలసీ ప్రభావం**

ఆంధ్రప్రదేశ్ కూటమి సర్కార్ తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీ ప్రకారం, 11 ప్రముఖ లిక్కర్ బ్రాండ్ల ధరలు గణనీయంగా తగ్గాయి. సరిహద్దు ప్రాంతాల్లో మద్యం ధరలు ఏపీలో చాలా తక్కువగా ఉన్నాయి. ఉదాహరణకి, బ్రాందీ క్వార్టర్ ధర తెలంగాణలో 130 రూపాయలు కాగా, అదే బ్రాండ్ ఏపీలో 120 రూపాయలకు అందుబాటులో ఉంది.

వివరాలు 2లో

### రికార్డు స్థాయిలో అమ్మకాలు

ఖమ్మం జిల్లాలో 2023 డిసెంబర్ 31 న దాదాపు రూ. 42 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇది అనేక రికార్డులు సృష్టించింది. సాధారణంగా, ఖమ్మం జిల్లాలో రోజుకు 5 కోట్ల రూపాయల మేర మద్యం అమ్మకాలు జరుగుతాయి, కానీ డిసెంబరు 31 న మూడు రెట్లు పెరిగాయి. ఖమ్మం జిల్లాలోని 208 వైన్ షాపులలో ఈ అమ్మకాలు జరిగినాయి. ఇందులో 11,924 సీసాల బీర్, 29,979 ఐఎంఎల్ లిక్కర్ బాటిళ్లు విక్రయమయ్యాయి.





## మహాయుతి కూటమిలో విభేదాలు?

**బాబాయ్- అబ్బాయ్ కలిసిపోతున్నారా?**

మహారాష్ట్రలో మళ్ళీ ట్విస్ట్ పాలిటిక్స్

వివరాలు 6లో

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 79,943.71 |
| 22 క్యారెట్ | 71,500 |
| సిల్వర్ (కేజీ) | 90,500 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 78,507.41 |
| నిఫ్టీ ↗ | 24,188.65 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.25 | 157.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.25 | 157.5 |
| రిటైల్ గుడ్డు ధర | 5.57 | 170.01 |

### ఈరోజు చికెన్ ధరలు

| | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర | 180 | 220 | 230 |
| హోల్ సేల్ ధర | 160 | 200 | 210 |





# టకా.. టక్ సంక్రాంతికి

ఆంక్షల్లేవ్.. అందరికీ రేవంత్ భరోసా



### సాగుచేసే ప్రతీరైతుకు పెట్టుబడి సాయం..


**కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం**

ఐటీ చెల్లింపు, భూమి పరిమితిని పెట్టవద్దని అభిప్రాయపడిన కమిటీ

రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయం

“ఆంక్షల్లేకుండా.. రైతుభరోసా ఇద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఒకేదఫా రూ.2లక్షల రుణమాఫీతో సాహసానికి చిరునామాగా మారిన రేవంత్ ఇపుడు రైతులకు పెట్టుబడి సాయం అందించే అంశంపై విపక్షాల విమర్శలు, అంచనాలకు భిన్నంగా రైతుల విషయంలో ఉదారంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. - మహా, హైదరాబాద్

వివరాలు 2లో





## మల్లారెడ్డి కాలేజీలో దారుణాలు

**అమ్మాయిల బాత్రూంలో సీక్రెట్ కెమెరాలు**

రంగంలోకి మహిళా కమిషన్.. సీపీకి కీలక ఆదేశాలు

కాలేజీ హాస్టల్ వార్డెన్ ప్రీతిరెడ్డి అరెస్ట్

**హైదరాబాద్, మహా :** మల్లారెడ్డి కాలేజీలో మరో దారుణం బయటపడింది. అమ్మాయిల బాత్రూంలో సీక్రెట్ కెమెరాల భాగోతం బయటపడింది. ఓ వైపు మహిళా కమిషన్ రంగంలోకి దిగగా, మరోవైపు హాస్టల్ వార్డెన్ ప్రీతిరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నగర శివార్లలోని కండ్లకోయలో మాజీ మంత్రి మల్లారెడ్డికి సంబంధించిన.. సీఎంఆర్ ఇంజనీరింగ్ క్యాంపస్‌కు సంబంధించిన అమ్మాయిల హాస్టళ్లలోని బాత్రూమ్‌లలో కెమెరాలు పెట్టి సీక్రెట్‌గా వీడియోలు తీశారంటూ విద్యార్థులు ఆందోళన చేపట్టటం సర్వత్రా సంచలనంగా మారింది.

మిగతా 2లో

## వరంగల్ ముద్దుబిడ్డకు అర్జున అవార్డ్

**సీఎం రేవంత్ వరాల జల్లు**

దీప్తికి గ్రూప్-2 స్థాయి ప్రభుత్వ ఉద్యోగం, వరంగల్‌లో 500 గజాల స్థలం కేటాయించాలని నిర్ణయం

06





## ప్లేస్ ఎక్కడైనా చర్చకు రెడీ.. టైమ్ కూడా చెప్పండి

**కవితకు సవాల్ విసిరిన టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**

కపట నాటకాలు కట్టిపెట్టమని హితవు

03



## మళ్ళీ ఈడీ నోటీసులు

- 8,9 తేదీలలో విచారణకు రమ్మని ఈడీ పిలుపు
- బీఎల్ఎన్‌రెడ్డి, అర్వింద్ కుమార్‌ల విజ్ఞప్తి మేరకు గడువు
- కేటీఆర్ గడువుకోరితే మరో తేదీ ఇచ్చే అవకాశం
- త్వరత్వరగా విచారించే యోచనలో ఈడీ

02





# తెలంగాణ మద్యంపై ఆంధ్ర ఎఫెక్ట్..!

## 650 కోట్ల రూపాయల మేరకు తగ్గిన అమ్మకాలు

### సరిహద్దుల్లో వెలవెలబోయిన మద్యం షాపులు

### కొత్త బ్రాండ్లపై ఎక్సైజ్ శాఖ కుస్తీ

(మొదటిపేజీ తరువాయి)

చౌక లిక్కర్ కూడా 99 రూపాయలకు అందుబాటులో రావడంతో, ఆంధ్ర ప్రాంత ప్రజలు తక్కువ ధరకు మంచి బ్రాండ్లను కొనుగోలు చేయటానికి ఆసక్తి చూపిస్తున్నారు.

**సరిహద్దు ప్రాంతాల్లో తగ్గిన విక్రయాలు**

గతంలో, తెలంగాణఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో వైన్ షాపులు జోరుగా అమ్మకాల నమోదు చేశాయి. కానీ ఇప్పుడు, ఈ పరిస్థితి మారిపోయింది. సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న వైన్ షాపులకు అమ్మకాలు లేక వెలవెలలాడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. సంఖ్యల్లో చెప్పాలంటే, 2023 డిసెంబరులో ఖమ్మం జిల్లాలో 264 కోట్ల రూపాయల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. 2024 డిసెంబరులో ఈ సంఖ్య 228 కోట్ల రూపాయల వరకే చేరింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2023 డిసెంబరులో 4,292 కోట్ల రూపాయల విలువైన మద్యం అమ్మకాలు జరిగినప్పటికీ, 2024 డిసెంబరులో 3,662 కోట్లకు పరిమితమయ్యాయి.

**ఎక్సైజ్ శాఖ చర్యలు**

డిసెంబరు 3031 మధ్య ఈ మద్యం అమ్మకాలతో ఎక్సైజ్ శాఖ ఖజానాకు భారీగా ఆదాయం వచ్చింది. సంక్రాంతి పండుగ రాబోతోందని, మరింత మద్యం అమ్మకాలు పెరిగేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అనేక రకాల బ్రాండ్లను కొత్తగా మార్కెట్లో విడుదల చేయడానికి ఎక్సైజ్ అధికారులు సిద్ధమవుతున్నారు.

**ఎక్సైజ్ శాఖ వర్గాల వ్యాఖ్యలు**

ఈ మార్పులు రాష్ట్రం యొక్క ఆర్థికవ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. తెలంగాణ ఎక్సైజ్ శాఖ వర్గాలు ఈ తగ్గుదల పరోక్షంగా రాష్ట్ర ఆదాయంపై ప్రభావం చూపవచ్చని హెచ్చరిస్తున్నారు. పరిశీలకులు, తెలంగాణ ప్రభుత్వం ఈ పరిణామాలు ప్రతికూల ప్రభావం చూపకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. "మద్యం అమ్మకాల తగ్గుదల రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయాన్ని ప్రభావితం చేస్తుంది. దీన్ని సమీక్షించి, సరిహద్దు వ్యాపార స్థితిగతులను మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలి," అని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

తెలంగాణ మద్యం మార్కెట్ తీవ్ర ప్రభావానికి లోనవుతుండగా, భవిష్యత్తులో ఈ సమస్యకు సమర్థమైన పరిష్కారం దొరకాలని మద్యం వ్యాపారులు ఆశిస్తున్నారు. ఈ పరిణామాలను తట్టుకుని, తెలంగాణ ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకుంటే, మద్యం విక్రయాలు పునరుద్ధరించబడటమే కాకుండా, రాష్ట్రం ఆర్థికంగా కూడా ముందుకు సాగవచ్చని నమ్మకాలు వ్యక్తం అవుతున్నాయి.

# రేవంత్ రెడ్డి పాన్ ఇండియా సీఎం అయ్యారు: ఎంపీ చామల

(మొదటిపేజీ తరువాయి)



గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఫార్ములా ఈ కార్ రేసు కేసుపై మాజీ మంత్రి కేటీఆర్ ఇప్పటికే పలు రకాల స్టేట్‌మెంట్స్ ఇచ్చారన్నారు. ఈ కేసులో కేటీఆర్ నిర్దోషి కావాలని కోరుకుంటున్నాం కానీ ఆయన తప్పు చేశారని తేలిందన్నారు. నోటిమాటగా చెప్పిన విషయాలను అధికారులు సీరియస్‌గా తీసుకోవద్దని చెప్పారు. ట్రిబుల్ ఆర్ ప్రాజెక్టుపై కేటీఆర్ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి వివరించామన్నారు. అప్పుల రాష్ట్రంలో ట్రిబుల్ ఆర్ లాంటి ప్రాజెక్టు గుదిబండగా కాకుండా ఉండేందుకు కొన్ని సలహాలు ఇచ్చారని చెప్పారు.

దోచుకునే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, దోచుకునే అలవాటు, దాచుకునే అలవాటు, చేసిన తప్పుల నుంచి తప్పించుకునే అలవాటు తమకు లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ప్రతి ప్రాజెక్టు అంచనా పెంచారన్నారు. బాధ్యతగా లేని ప్రతిపక్షం రాష్ట్రంలో ఉండటం ప్రభుత్వం, ప్రజలకు మంచిది కాదని చెప్పారు. ప్రతిపక్షాలు పాలకులకు సరైన దారి చూపించాలన్నారు. పొద్దున లేస్తే కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ నేతలు బురద జల్లాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కి ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఇచ్చినా సైలెంట్‌గా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. కేటీఆర్, కవిత, హరీష్‌రావు ఇప్పటికైనా మంచి ప్రతిపక్షాన్ని తయారు చేసుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ నేతలు రైతు భరోసాపై రైతులను గందరగోళానికి గురి చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో మల్టిపుల్ విండోస్ సిస్టం అయిందన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్ రెడ్డి కలసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించారన్నారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును మొత్తం కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని కోరామని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ కోసం ముందు ల్యాండ్ సేకరించాలని కేంద్ర మంత్రి తమకు సూచించారన్నారు. ఇష్టారీతిన ప్రాజెక్టు కాస్ట్ పెంచారు కాబట్టే రూ.7 వేల కోట్ల ప్రాజెక్టులో రూ. 12 వేల అవినీతి జరిగిందని కేటీఆర్ అంటున్నారన్నారు. కేసీఆర్ ఎలాగూ బయటకు రారని, హరీష్ రావు, కేటీఆర్, కవిత వెళ్లి అయినా సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తే మంచిదని సూచించారు. 2025లో అయినా బీఆర్ఎస్ నేతలకు జ్ఞానోదయం కలగాలన్నారు. రైతు భరోసా విషయంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. కేసీఆర్ అనాలోచిత నిర్ణయం వల్ల రైతు బంధులో రూ. 22 వేల కోట్లు అనర్హులకు ఇచ్చారన్నారు. ఈ ఫార్ములా కేసులో కేటీఆర్ రోజుకో మాట మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఫార్ములా ఈ కార్ రేసు కేసుపై కేటీఆర్ మాటమారుస్తున్నారని ధ్వజమెత్తారు. ఒకరోజు తనకు సంబంధం లేదు అంటాడు, మరొక రోజు అధికారులకు సంబంధం లేదు అంతా తానే చేశానని అంటారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.



# సంక్రాంతికి టకా.. టక్

### ఆంక్షల్లేవ్.. అందరికీ రేవంత్ భరోసా



## సాగుచేసే ప్రతీరైతుకు పెట్టుబడి సాయం..

### కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం

### ఐటీ చెల్లింపు, భూమి పరిమితిని పెట్టవద్దని అభిప్రాయపడిన కమిటీ

### రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయం

**హైదరాబాద్, మహా:** ఆంక్షల్లేకుండా.. రైతుభరోసా ఇద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఒకేదఫా రూ.2లక్షల రుణమాఫీతో సాహసానికి చిరునామాగా మారిన రేవంత్ ఇపుడు రైతులకు పెట్టుబడి సాయం అందించే అంశంపై విపక్షాల విమర్శలు, అంచనాలకు భిన్నంగా రైతుల విషయంలో ఉదారంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో గురువారం జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రైతుభరోసాకు తుదిరూపునిచ్చారు. నివేదికకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేబినెట్ సబ్ కమిటీ అందించనుండగా, మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. విధివిధానాలు ఎలా ఉన్నా.. సంక్రాంతిరోజు మాత్రం.. టకాటక్.. టకాటక్ అంటూ రైతుల ఫోన్లలోకి భరోసా మెసేజ్ లు, రైతుల ఖాతాల్లోకి డబ్బులు వెళ్ళాలని ప్రభుత్వం భావిస్తోంది.

**దరఖాస్తులు తీసుకుని..**

రైతు భరోసా కోసం తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలుస్తోంది. రైతు భరోసాపై మంత్రివర్గానికి చేయాల్సిన సిఫార్సులపై చర్చించేందుకు కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సాగు చేసే ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, భూమి పరిమితిని పెట్టవద్దని కమిటీ అభిప్రాయపడింది. అలాగే, రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సబ్ కమిటీ నిర్ణయించింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చైర్మన్‌గా, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు సభ్యులుగా ఉప సంఘం ఏర్పాటైంది. ఈ కేబినెట్ సబ్ కమిటీ పలుమార్లు భేటీ అయింది. కాగా, అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములను గుర్తించనున్నారు. జనవరి 5 నుంచి 7 వరకు రైతు భరోసా దరఖాస్తులు స్వీకరించే అవకాశముంది. సంక్రాంతి పండుగ తర్వాత ప్రభుత్వం రైతు భరోసాను ఇవ్వనుంది. ఎల్లుండి జరిగే కేబినెట్ సమావేశంలో రైతు భరోసాకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. సంక్రాంతి అంటే రైతుల పండుగ కాగా, ఈ పథకంతో రైతులకు అండగా ఉంటామన్న భరోసా ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. రుణమాఫీ అమలు సమయంలో జరిగిన దుష్ప్రచారం, తప్పులను పరిగణనలోకి తీసుకుని ఈ దఫా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించింది.

# మళ్ళీ ఈడీ నోటీసులు

## 8,9 తేదీలలో విచారణకు రమ్మని ఈడీ పిలుపు

### బీఎల్ఎన్‌రెడ్డి,అర్వింద్ కుమార్ ల విజ్ఞప్తి మేరకు గడువు

### కేటీఆర్ గడువుకోరితే మరో తేదీ ఇచ్చే అవకాశం

### త్వరత్వరగా విచారించే యోచనలో ఈడీ

**హైదరాబాద్, మహా:** ఫార్ములా ఈ రేస్ కేసులో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి గురువారం ఈడీ విచారణకు గైర్హాజరయ్యారు. ఇద్దరు అధికారులు విచారణకు హాజరయ్యేందుకు ఈడీని గడువు కోరిన గడువును కోరారు. విచారణకు బీఎల్ఎన్ రెడ్డి ఈనెల 8న హాజరవుతానని ఈడీ అధికారులకు తెలిపారు. రేపు జనవరి 03న ఐఏఎస్ అధికారి సీనియర్ ఐఏఎస్ అర్వింద్ కుమార్ సైతం హాజరు కావాల్సి ఉండగా, ఈనెల 9న హాజరవుతానని ఆయన ఈడీని కోరారు. ఐఏఎస్ అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి విజ్ఞప్తులను పరిశీలించిన ఈడి ఈనెల 8,9 తేదీలలో హాజరుకావాలని మళ్ళీ నోటీసులిచ్చింది. కేటీఆర్ 7వ తేదీన హాజరుకావాల్సి ఉండగా, ముందు హాజరవుతారా.. గడువు కోరుతారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. తాజా తేదీలను పేర్కొనడాన్ని బట్టి వ్యూహం ప్రకారమే కేటీఆర్ తర్వాత విచారణ తేదీలను ఎన్నుకున్నారా.. అనేదానిపై చర్చ జరుగుతోంది.

**తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు**

ఏసీబీ కేసు నమోదు చేసిన అనంతరం మాజీ మంత్రి కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాల్సిందిగా హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం కేటీఆర్‌కు ఊరట కల్పించింది. కేటీఆర్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం 2024 డిసెంబర్ 31 వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది. తాజాగా డిసెంబర్ 31న జరిగిన విచారణలో కేటీఆర్‌ను ఎలాంటి అరెస్ట్ చేయవద్దంటూ పోలీసులను ఆదేశిస్తూ ఈ కేసు తీర్పును రిజర్వ్ చేసింది.



**నిధులు నేరుగా మళ్లింపు**

హైదరాబాద్‌లో ఈ-రేస్ నిర్వహణకు ఫార్ములా ఈ ఆపరేషన్స్ అనే సంస్థకు నేరుగా రూ. 45.71 కోట్లను యూకే అధికారిక కరెన్సీ బ్రిటీష్ పౌండ్ రూపంలో బదిలీ చేసిన ఘటనపై ఈడీ ఆరా తీస్తోంది. ఏసీబీలో నమోదైన కేసు ఆధారంగా మరో కేసు నమోదు చేసి ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఫార్ములా ఈ రేసింగ్ కేసులో అవకతవకలు జరిగాయని, భారీగా నిధుల మళ్లింపు జరిగిందని నిర్ధారించిన ఏసీబీ ప్రధానంగా ముగ్గురిపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది. ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ఏ-1గా, అప్పటి పురపాలక శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్ ఏ-2గా, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి ఏ-3గా పేర్కొంది.




# మల్లారెడ్డి కాలేజీలో దారుణాలు

### అమ్మాయిల బాత్రూంలో సీక్రెట్ కెమెరాలు.. రంగంలోకి మహిళా కమిషన్.. సీపీకి కీలక ఆదేశాలు.. కాలేజీ హాస్టల్ వార్డెన్ ప్రీతిరెడ్డి అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం రాత్రి ఈ విషయం వెలుగులోకి రావటంతో విద్యార్థులతో పాటు విద్యార్థి సంఘాలు కూడా పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. ఈ వ్యవహారాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించి ఘటనపై తక్షణమే నివేదిక సమర్పించాలని సైబరాబాద్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంలో విస్తుపోయే విషయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. విద్యార్థులు ఆందోళనకు దిగటంతో కాలేజీ దగ్గర రాత్రి సమయంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో విద్యార్థుల ఆరోపణలను సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు కూడా చేపట్టారు. ఈ మేరకు మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి పలు కీలక విషయాలను మీడియాకు వెల్లడించారు. హాస్టల్‌లోని వంట సిబ్బందే ఈ దుశ్చర్యకు పాల్పడినట్టు విద్యార్థులు ఆరోపిస్తుండటంతో పాటు మెస్‌లో పని చేసే వ్యక్తులు మాత్రమే లోపలికి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ కోణంలోనే విచారణ చేస్తున్నామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆరుగురిని అదుపులోకి తీసుకుని.. వారికి సంబంధించిన 12 సెల్ ఫోన్లను సీజ్ చేశామని తెలిపారు. సీజ్ చేసిన సెల్ ఫోన్ లలో ధమకెలాంటి ఎలాంటి అశ్లీల వీడియోలు లభించలేదని చెప్పుకొచ్చారు. అయినప్పటికీ ఫోన్లను ఫొరెన్సిక్ ల్యాబ్ కు పంపించడం జరిగిందని, వీడియోలను ఒక వేళ డిలిట్ చేసినా ఫొరెన్సిక్ పరీక్షల్లో తెలిసే అవకాశాలున్నాయన్నారు. ఈ ఘటనలో విద్యార్థుల స్టేట్‌మెంట్ రికార్డు చేశామని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మరో వైపు కళాశాల యాజమాన్యం నుంచి తమకెలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. కళాశాల హాస్టల్ ముందు విద్యార్థులు ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం కనీసం బందోబస్తు కోసం కూడా తమను సంప్రదించలేదన్నారు. కళాశాల యాజమాన్యం తీరు ఆక్షేపణీయంగా ఉందని ఏసీపీ తెలిపారు. విద్యార్థుల భద్రత బాధ్యత కళాశాలదే అన్న విషయాన్ని విస్మరించడంపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. అయితే.. హాస్టల్ బాత్‌రూముల్లో కెమెరాలు పెట్టి సుమారు 300 వీడియోలు రికార్డ్ చేశారంటూ విద్యార్థులు కీలక ఆరోణపలు చేస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అంతేకాకుండా హాస్టల్ సిబ్బంది బాత్రూమ్‌ల వెంటిలేటర్ల నుంచి వీడియోలు తీశారని, ఈ విషయం వార్డెన్‌కు కూడా చెప్పామని విద్యార్థులు చెబుతున్నారు. కానీ హాస్టల్ వార్డెన్ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించి.. తమపైనే అసభ్యకరంగా మాట్లాడారని బాధిత స్టూడెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సీక్రెట్ వీడియోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తే తమ పరిస్థితేంటని విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కాలేజీ యాజమాన్యం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పోలీసులు సంఘటనకు బాధ్యులుగా భావించి హాస్టల్ వార్డెన్ ప్రీతిరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.



# ప్లేస్ ఎక్కడైనా చర్చకు రెడీ.. టైమ్ కూడా చెప్పండి

## కవితకు సవాల్ విసిరిన టీపీసీసీ చీఫ్.. కపట నాటకాలు కట్టిపెట్టమని హితవు





**హైదరాబాద్, మహా:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ గౌడ్ గురువారం బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు, ఎమ్మెల్సీ కవితకు సవాల్ విసిరారు. బీసీలపై కపటప్రేమను చూపుతున్న కవిత, ముందుగా తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. ఆ తర్వాత ధర్నా చేయాలని మహేష్ గౌడ్ హితవు పలికారు. హైదరాబాద్ పీసీసీ కార్యాలయంలో మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ బీసీలను వంచించడమే కాకుండా, వారికి న్యాయంగా అందాల్సిన నిధులను ఏ ఒక్క సంవత్సరంలో కూడా ఖర్చు చేయకుండా వారిని నిట్టనిలువునా ముంచిందని విమర్శించారు. ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత బీసీలపై కపట ప్రేమ చూపుతూ కల్వకుంట్ల కుటుంబం వారిపై మొసలికన్నీరు కారుస్తోందన్నారు. బీసీలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ మాత్రమే చేయగలదన్న మహేష్ గౌడ్, అధికారం పోయిన తర్వాత బీఆర్ఎస్ కు బీసీలు గుర్తుకొచ్చారన్నారని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసి వారి గొంతు కోసింది బీఆర్ఎస్ అన్నారు. లిక్కర్ స్కాంలో మరకంటించుకున్న ఎమ్మెల్సీ కవిత దాన్ని పోగొట్టుకోవడంతో పాటు బీఆర్ఎస్ పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడంతో ఎటూ పాలుపోని ఆమె, రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడం కోసం ఇప్పుడు బీసీల పేరిట కపట నాటకం మొదలు పెట్టారని సీరియస్ కామెంట్స్ చేశారు.

అందులో భాగంగానే ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపడుతున్నారని, విజ్ఞులైన బీసీలు ఈ కుట్రలను గమనించి బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ తరఫున ఆయన కోరారు. కాంగ్రెస్ బీసీలకు పెద్దపీట వేస్తుందనడానికి నిదర్శనమే తనను తెలంగాణ అధ్యక్షులుగా నియమించడమేనంటూ బీసీలకు మహేష్ గౌడ్ గుర్తు చేశారు. అంతేకాక రాష్ట్ర క్యాబినెట్లో బీసీలకు అధిక ప్రాధాన్యతిచ్చిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా బీసీ నేతను ఏర్పాటు చేయడం సాధ్యపడుతుందా..? మీ ప్రభుత్వ హయాంలో మంత్రులుగా బీసీలకు ఎంత ప్రాధాన్యతిచ్చారో బహిరంగ రహస్యమేనని విమర్శించారు మహేష్ గౌడ్. మీ పాలనలో బీసీలను అడుగడుగున అణగదొక్కిన మీరు, ఇప్పుడు బీసీ జపం చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. బీసీల పేరుతో ధర్నా చేయాలని నిర్ణయించిన మీకు టీపీసీసీ అధ్యక్షులుగా కొన్ని ప్రశ్నలను సంధిస్తున్నానని, మీరు వీటికి సరైన సమాధానం కవిత చెప్పాలన్నారు.

### ప్రశ్నలు ఇవే..

- కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రస్తుతమున్న రిజర్వేషన్లను 23 శాతం నుండి 42 శాతానికి పెంచడం కోసం చర్యలు తీసుకొని, అందులో భాగంగా సమగ్ర కుటుంబ సర్వే చేపడుతున్నందుకు మీరు ధర్నా చేస్తున్నారా..?
- బీసీలకు రిజర్వేషన్లు పెంచడం ద్వారా పంచాయతీలు, మున్సిపాల్టీల్లో కొత్తగా 23,973 మంది బీసీలకు ప్రాతినిధ్యం లభించే అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టినందుకు ధర్నా చేస్తున్నారా..?
- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు చర్యలు చేపడుతున్నందుకు ధర్నా చేస్తున్నారా..?
- స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్ల శాతాన్ని నిర్ధారించడానికి గాను ప్రజా ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో కమిటీని నియమించినందుకు ధర్నా చేస్తున్నారా..?
- జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం జరిగేందుకు రాష్ట్రంలో కులగణన చేపట్టినందుకు ధర్నా చేస్తున్నారా..?
- గత బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంక్షేమ బడ్జెట్ను 2971.32 కోట్ల రూపాయలకు పెంచినందుకు ధర్నా చేస్తున్నారా..?
- కాంగ్రెస్ ప్రభుత్వం గీతన్నల ఆవేదనను గుర్తించి తాడి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ధర్నా చేస్తున్నారా..?
- గీతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం కాటమయ్య రక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు ధర్నా చేస్తున్నారా..?
- బీసీ సామాజిక వర్గానికి సంబంధించి 10 సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసినందుకు ధర్నా చేస్తున్నారా..?
- ఎమ్బీసీ కార్పొరేషన్కు రూ.400 కోట్లు కేటాయించినందుకు ధర్నా చేస్తున్నారా..?
- మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల్లోని వివిధ విభాగాల్లో 5136 మంది ఉద్యోగులను నూతనంగా నియమించినందుకు ధర్నా చేస్తున్నారా..?
- బీసీ హాస్టళ్లకు పక్కా భవనాల నిర్మాణాల్లో భాగంగా ఇప్పటికే 20 నిర్మాణాలకు కోసం 100 కోట్ల రూపాయలను కేటాయించినందుకు ధర్నా చేస్తున్నారా..?
- గురుకులాల్లో డైట్ కాస్మోటిక్ చార్జీలు 40 శాతానికి పెంచినందుకు ధర్నా చేస్తున్నారా..?
- 28 యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ స్కూల్స్ నూతనంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నందుకు ధర్నా చేస్తున్నారా..?
- బీసీ కార్పొరేషన్ కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 73 కోట్ల రూపాయలను కేటాయించినందుకు ధర్నా చేస్తున్నారా..?

# రేవంత్ రెడ్డి... కేసీఆర్ మార్గంలో నడవక తప్పదు : కేపీ వివేకానంద

### మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రో పొడిగింపు ప్రజల విజయమని వ్యాఖ్య

### రాయదుర్గం–శంషాబాద్ మార్గం పనులను తిరిగి ప్రారంభించాలని డిమాండ్



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ మార్గంలో నడవక తప్పదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రో మార్గాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ప్రకటనతో అది మరోసారి తేలిందన్నారు. కేవలం ఒక మెట్రో విషయంలోనే కాదని... అన్నింటా కేసీఆర్‌ను అనుసరించక తప్పదన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ నార్త్ సిటీ వైపు మెట్రో మార్గం పొడిగింపు ప్రజల విజయమన్నారు. మెట్రో పొడిగింపు నిర్ణయం సంతోషమేనని, కానీ ఎప్పుడు దీనిని పూర్తి చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం ఇప్పటి వరకు తట్టెడు మట్టి తీయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాయదుర్గంశంషాబాద్ మెట్రో రైలు పనులను రద్దు చేశారని ఆరోపించారు. ఆ పనులను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పనులు రద్దు చేసినప్పుడే అసెంబ్లీలో ప్రభుత్వాన్ని అడిగామన్నారు. సైంటిఫిక్‌గా స్టడీ చేసి పనులు ప్రారంభించిన మెట్రో మార్గాన్ని రద్దు చేయడం సరికాదన్నారు.

# బీజేపీలో ఈటల మౌనం

### వెనుక మతలబేంటని మొదలైన చర్చ

### అధ్యక్ష పదవిపై పార్టీలోని వారే అడ్డుపుల్లలు

### పునరాలోచనలో హామీ ఇచ్చిన అధిష్టానం

### లాభం లేదని భావిస్తున్న మల్కాజిగిరి ఎంపీ

### భవిష్యత్ ప్రణాళికపై దృష్టి




**హైదరాబాద్, మహా :** ఈటల రాజేందర్ 20ఏళ్లుగా రాష్ట్ర రాజకీయాల్లో పరిచయం అక్కర్లేని నేత. రెండు దశాబ్దాలుగా పొలిటికల్‌గా లైమ్ లైట్‌లో ఉంటూ వచ్చిన ఆయన ఇప్పుడు సైలెంట్ అయిపోయారన్న టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం బీజేపీలో ఉన్న ఆయన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలనుకుంటున్నారు. అందుకోసం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో ఉన్న సాన్నిహిత్యంతో ప్రయత్నాలు కూడా చేశారు. ఈటలకు రాష్ట్ర రథసారధి పగ్గాలు అప్పగించేందుకు బీజేపీ అధిష్టానం కూడా ఒకానొక టైమ్‌లో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కిషన్‌రెడ్డి స్థానంలో ఈటల రాజేందర్‌ను స్టేట్ ప్రెసిడెంట్ చేయడం ఖాయమన్న ప్రచారం కూడా అప్పట్లో జోరుగా సాగింది. ఇప్పుడు కూడా రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో ఈటల రాజేందర్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. అయితే ఈటల రాజేందర్ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యేందుకు ఎన్నో ఈక్వేషన్స్ అడ్డొస్తున్నాయి. ఆయన వామపక్ష భావజాలం ఉన్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) నుంచి వచ్చిన నేత కావడంతో రాష్ట్ర బీజేపీలో కొందరు ఆయనకు రాష్ట్ర పగ్గాలు దక్కకుండా అడ్డుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈటలను స్టేట్ ప్రెసిడెంట్ చేస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని, పార్టీ క్యాడర్ సహకరించే పరిస్థితి ఉండదని పలువురు బీజేపీ నేతలు అడ్డు పుల్లలు వేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అందుకు కారణం ఆయనకు ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ లేకపోవడమే ప్రధానం. అంతేకాదు బీజేపీలో చేరిన తర్వాత కూడా ఈటల పార్టీ భావజాలాన్ని పూర్తిగా పునికి పుచ్చుకోవడం లేదని, సొంత ఎదుగుదల కోసమే ప్రయత్నం చేస్తున్నారని అధిష్టానం పెద్దలకు కొందరు ఫిర్యాదులు చేశారన్న ప్రచతారం కూడా సాగుతోంది. దీంతో దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడం లేదన్న పరిస్థితిని ఈటల ఫేస్ చేస్తున్నారు. బీజేపీ పెద్దలు తనను అధ్యక్షుడ్ని చేసేందుకు సిద్ధంగా ఉన్న రాష్ట్ర నేతలు అడ్డుకుంటున్నారని ఈటల తన సన్నిహితులు కొంత మంది వద్ద అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అందుకే కొన్ని రోజులుగా ఈటల మౌనంగా ఉంటున్నారన్న ప్రచారం జోరందుకుంది. అంతేకాకండా పార్టీ కార్యాలయానికి కూడా ఈటల మాత్రంగానే వస్తున్నారు.

వామపక్ష భావజాలం ఉన్న రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్ యూ) నుంచి ప్రస్థానం ప్రారంభించి అప్పటి టీఆర్ఎస్ పార్టీలో చేరి తెలంగాణ ఉద్యమంలో తనదైన శైలిలో తనవంతు పాత్రను ఈచటల పోషించారు. ఆ తర్వాత కేసీఆర్‌తో గ్యాప్ వచ్చి కారు పార్టీని వీడారు. అప్పటి నుంచి ఆయన రాజకీయ ఎదుగుదల ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. టీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు దక్కిన గౌరవం ఇప్పుడు బీజేపీలో దక్కుతున్న గౌరవాన్ని లెక్కేసుకుంటున్న ఈటల అసంతృప్తిలో ఉన్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని మీడియా ఇంటర్వ్యూల్లో ఆయనే సార్లు పరోక్షంగా ఈటల వెల్లడించారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సొంత నియోజకవర్గం హుజురాబాద్‌లో పోటీ చేయడంతో పాటు కేసీఆర్‌ను ఓడిస్తానంటూ గజ్వేల్ బరిలో నిలిస్తే రెండు చోట్ల పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత తనకు అధ్యక్ష పదవి దక్కడం ఖాయమని భావించారు. ఇంటిపోరుతో ప్రెసిడెంట్ పదవి దక్కేలా లేదని తగిన గౌరవం ఇవ్వడం లేదని అనుచరుల దగ్గర ఈటల కొంత అసహనం వ్యక్తం చేస్తున్నారు. పైగా పార్టీలో బలమైన బీసీ లీడర్‌గా ఉన్న తమ నేతకు చెక్ పెట్టేలా ఆర్. కృష్ణయ్యను రాజ్యసభకు ఎంపిక చేశారనే అభిప్రాయం ఈటల అనుచరుల్లో వ్యక్తం అవుతోంది. పార్టీ అధ్యక్ష పదవి కోసం ఓ రేంజ్‌లో ట్రై చేసిన ఈటలకు స్టేట్ బీజేపీ లీడర్ల సహకారం లేకపోవడంతో ప్రస్తుతం డైలమాలో పడిపోయారు. అయితే ఈటల తన 20 మంది అనుచరులకు గత ఎన్నికల్లో టికెట్లు ఇప్పించుకున్నారని, వారెవరికీ డిపాజిట్లు కూడా రాలేదని పార్టీ పెద్దల దృష్టికి కొంత మంది రాష్ట్ర నేతలు తీసుకెళ్లారన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. అంతేకాదు ఈటల అధ్యక్షుడైతే ఆయన అనుచరులకు, ఆయన భావజాలం వ్యక్తులకే టికెట్లు ఇప్పించుకుంటారని, దాంతో పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని ఉన్న నేతలకు అన్యాయం జరుగుతుందని కొంత మంది అధిష్టానం వద్ద స్పష్టం చేశారన్న ప్రచారం కూడా సాగుతోంది. ఈ పరిస్థితుల్లో అధ్యక్ష పదవి రాదేమోనన్న డైలమాలో ఈటల పడిపోయారు. అందుకే మౌనంగా ఉంటున్న ఈటల తన పని తాను చేసుకుంటున్నారని ఆయన అనుయాయులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎంత పోరాడినా..పార్టీ పటిష్టత కోసం శ్రమిస్తున్నా ఫలితం లేదని అసంతృప్తిలో ఈటల ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈటల రాజకీయ అడుగులు ఎటువైపు పడుతాయనేది చర్చనీయాంశంగా మారింది.

# కేసీఆర్ ఫ్యామిలీ జైలుకే

### కల్వకుంట్ల కేసీఆర్ కుటుంబమంతా జైలులో ఊచలు లెక్కించాల్సిందే

### రేపోమాపో కేటీఆర్ జైలుకు వెళ్ళబోతున్నారు.. కడియం శ్రీహరి హాట్ కామెంట్స్



**వరంగల్, మహా:** కల్వకుంట్ల కేసీఆర్ కుటుంబమంతా రేపో మాపో జైలులో ఊచలు లెక్కపెట్టబోతున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. మీరు నిజాయితీపరులైతే మీపై ఇన్ని కేసులు ఎందుకు నమోదవుతాయని కేసీఆర్ కుటుంబాన్ని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కేసులో రేపో మాపో కేసీఆర్ కుమారుడు కేటీఆర్ కూడా జైలుకు వెళ్లబోతున్నారని అన్నారు. 2014లో కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు ఎన్ని.. ఇప్పుడు ఎన్నో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పుడు రూ. 10 కోట్ల ఆస్తులు లేని మీకు.. ఇప్పుడు వేల కోట్ల ఆస్తులు, వందలాది ఎకరాల భూములు ఎలా వచ్చాయని కడియం శ్రీహరి ప్రశ్నించారు. దళితబంధులో కమీషన్ తీసుకున్నవారు.. ఇప్పుడు నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడినవారు నీతులు మాట్లాడటం హాస్యాస్పందంగా ఉందని విమర్శించారు. కడియం శ్రీహరి తప్పు చేస్తే ఆధారాలు చూపించాలని.. ఇకనైనా సాక్ష్యాలు లేకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్, హరీశ్ రావు అనేక విధాలుగా సాంకేతిక తప్పులు చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో కేసీఆర్ కుటుంబం పెద్ద మొత్తంలో వనరులను దోచుకుందని ఆరోపించారు. కొత్త రకమైన అవినీతికి పాల్పడ్డారన్నారు. మీ కుటుంబంపై అవినీతి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయని కేసీఆర్‌ను ప్రశ్నించారు.

# పుష్ప 2 నిర్మాతలకు ఊరట

### సంధ్య థియేటర్ ఘటనలో అరెస్టు చేయొద్దని హైకోర్టు ఆదేశం

### ఊపిరి పీల్చుకున్న నిర్మాతలు యలమంచిలి, యెర్నేని

### దర్యాప్తు కొనసాగించవచ్చన్న కోర్టు



**హైదరాబాద్, మహా :** గత ఏడాది డిసెంబర్ 4న సంధ్య థియేటర్ లో పుష్ప 2 చిత్రం బెనిఫిట్ షో సందర్భంగా హీరో అల్లు అర్జున్ రావడంతో చోటు చేసుకున్న తోపులాట ఘటనలో రేవతి అనే మహిళ చనిపోయింది. ఆమె కుమారుడు శ్రీతేజ్ ఇంకా ఆస్పత్రిలోనే ఉన్నాడు. కానీ ఈ ఘటనకు కారకులైన ఒక్కొక్కరికీ వరుసగా ఊరట లభిస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ఎ11గా ఉన్న అల్లు అర్జున్ ను అరెస్టు చేయకుండా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయగా ఇప్పుడు మరికొందరికి ఊరట లభించింది. హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తోపులాట ఘటనపై ఇప్పటికే కేసు నమోదు చేసిన పోలీసులు హీరో అల్లు అర్జున్ ను అరెస్టు చేయడంతో ఆయన హైకోర్టుకు వెళ్లి మధ్యంతర బెయిల్ తెచ్చుకున్నారు. అలాగే అల్లు అర్జున్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై విచారణ జరుగుతోంది. అదే సమయంలో పుష్ప 2 చిత్ర నిర్మాతలు అయిన నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ తమపై చిక్కడపల్లి పోలీసులు పెట్టిన కేసును క్వాష్ చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై గురువారం విచారణ జరిపిన హైకోర్టు వారిని అరెస్టు చేయొద్దని పోలీసులకు ఆదేశాలిస్తూ దర్యాప్తును కొనసాగించవచ్చని తెలిపింది. పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని నిందితులుగా ఉన్న పుష్ప 2 నిర్మాతలు నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ కు హైకోర్టు ఈ సందర్భంగా ఆదేశించింది. మరోవైపు తోపులాట ఘటనలో తమకూ బెయిల్ ఇవ్వాలని కోరుతూ సంధ్య థియేటర్ మేనేజర్ అడ్ల శరత్ చంద్రనాయుడు, అల్లు అర్జున్ వర్సనల్ సిబ్బంది దాఖలు చేసుకున్న పిటిషన్లపై విచారణను ఈ నెల 6న చేపట్టేందుకు హైకోర్టు అంగీకరించింది.

# కుంభకోణాలు బయటపెడతా

### బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

### రాష్ట్ర రైతాంగం మీద కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు చెప్పాలి

### గడిచిన ఏడాదంతా మోసాలే




**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వంలో కొన్ని వేల కోట్ల కుంభకోణాలు జరిగాయని.. వాటిని త్వరలో బయట పెడతామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఇందులో మంత్రులు ఎవరెవరు ఇన్వాల్ అయ్యారో ఆధారాలతో సహా చెబుతామని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూస్తామని అన్నారు. రేవంత్ రెడ్డి సినిమా డైలాగ్‌లకు మాత్రమే పరిమితమయ్యారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిందని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధుపై తన విధి విధానాలు ఏందో చెప్పిందని అన్నారు. రాష్ట్ర రైతాంగం మీద కాంగ్రెస్ ప్రభుత్వ విధి విధానాలు ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. రైతు సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫల అయిందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. రైతు బంధును రైతు భరోసాగా పేరు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏం లేదని ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.... గడిచిన ఏడాది అంతా కాంగ్రెస్ మోసాల సంవత్సరమని విమర్శించారు. కొత్త ఏడాదిలో అయినా కాంగ్రెస్ ప్రభుత్వం మంచి బుద్ధి అలవరచుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం ఇచ్చిన మొదటి హామీ రైతు రుణమాఫీ అని చెప్పారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క లేనిపోని గొప్పలు చెబుతున్నారని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జీగా భుపేష్ బగేల్

### మాజీ సీఎంకు తెలంగాణ బాధ్యతలు

### రాహుల్ కీలక నిర్ణయం.. దీపాదాస్ మున్షీకి స్పెషల్ టాస్క్

### పార్టీ బలోపేతంపై రాహుల్ స్పెషల్ ఫోకస్



**హైదరాబాద్, మహా :** రాష్ట్ర కాంగ్రెస్ లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్రంలో పార్టీని మరింతగా బలోపేతం చేయటం కోసం రాహుల్ గాంధీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. పాలనా పరంగా రేవంత్ పైన పూర్తి నమ్మకంతో ఉన్న హైకమాండ్.. ఇప్పుడు పార్టీ వ్యవహారాల కోసం కొత్త ఇంఛార్జ్ ను నియమించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న దీపాదాస్ మున్షీ స్థానంలో మాజీ సీఎంకు తెలంగాణ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు కాంగ్రెస్ వర్గాల సమాచారం. కొత్త ఇంఛార్జ్ గా కాంగ్రెస్ అధినాయకత్వం పలు రాష్ట్రాల పార్టీ ఇంఛార్జ్ ల మార్పు పైన కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా తెలంగాణ బాధ్యతల పైన కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో పార్టీ విజయం సాధించిన తరువాత దీపాదాస్ మున్షీని పార్టీ ఇంఛార్జ్ గా నియమించారు. కాగా, ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లో అవసరాలు.. మారుతున్న రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా కొత్త ఇంఛార్జ్ ల నియామకం పైన నిర్ణయాలు జరుగుతున్నాయి. ఇక, ప్రస్తుత తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జ్ దీపాదాస్ మున్షీ స్థానంలో ఛత్తీస్ ఘడ్ మాజీ సీఎం భూపేష్ బగెల్ ను నియమించాలని అధిష్టానం నిర్ణయానికి వచ్చింది. ఇక ప్రస్తుత రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ దీపాదాస్ మున్షీ సేవలు త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో వినియోగించాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ప్రస్తుత మార్పులు చేస్తున్నట్లు చెబుతున్నారు. త్వరలో ఎన్నికలు జరిగే ఢిల్లీ, బీహార్ పైన కాంగ్రెస్ హైకమాండ్ ఫోకస్ చేసింది. అక్కడ ప్రత్యేకంగా ఎంపిక చేసిన పార్టీ నేతలను మొహరిస్తోంది. సంక్రాంతిలోగానే ఢిల్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. అక్కడ ఆప్‌తో పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేయాలని కాంగ్రెస్ డిసైడ్ అయింది. ఈ క్రమంలో ఢిల్లీతో పాటుగా బీహార్ ఎన్నికలు కాంగ్రెస్ నాయకత్వానికి ప్రతిష్ఠాత్మకంగా మారుతున్నాయి. తెలంగాణలో పూర్తిగా సీఎం రేవంత్ మహేష్ గౌడ్ ప్రభుత్వం పార్టీ వ్యవహారాలను ముందుండి నడిపిస్తున్నారు. ఇక, త్వరలో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ టైం లో రాష్ట్రంలో పార్టీని మరింతగా బలోపేతం చేయటంతో పాటుగా పీసీసీ జిల్లా కమిటీలు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పటికే కసరత్తు కొనసాగుతోంది. బడ్జెట్ సమావేశాల తరువాత ఈ ఎన్నికలు జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ సమయంలో మాజీ సీఎం కు తెలంగాణ పార్టీ ఇంఛార్జ్ బాధ్యతలు అప్పగిస్తే పార్టీ మరిత బలపడుతుందన్న ఉద్దేశ్యంతో జాతీయ నాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# 6జి కాలం వచ్చేసింది

## ప్రయోగాల్లో ఛాంపియన్ చైనా.. ఈ టెక్నాలజీ వస్తే 100 సినిమాలను ఒక నిమిషంలో డౌన్‌లోడ్ చేసుకోవొచ్చు

**మహా ప్రత్యేకం:**

భారత్ లో 5జి టెక్నాలజీనే అంతటా చేరకపోగా.. చైనా 6జిలో అద్భుతాలు చేస్తోంది. ఎలన్ మస్క్ స్టార్ లింక్ ను వెనక్కుతోసేసి 6జి ప్రయోగాల్లో ఛాంపియన్ గా నిలిచింది. శరవేగంగా డేటాను ట్రాన్స్‌మిట్ చేయడంలో చైనా తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించింది. 6జీ రేసులో మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌ను వెనక్కి తోసినట్లు అధికారికంగా ప్రకటించింది. ఆ దేశానికి చెందిన చాంగ్ గువాంగ్ శాటిలైట్ టెక్నాలజీ సెకనుకు 100 గిగాబిట్స్ డేటాను ట్రాన్స్‌మిట్ చేసేలా అత్యాధునిక హైరిజల్యూషన్ స్పేస్ టు గ్రౌండ్ లేజర్ ట్రాన్స్‌మిషన్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగంలో భాగంగా జిలిన్1 ఉపగ్రహం నుంచి ట్రక్‌పై అమర్చిన గ్రౌండ్ స్టేషన్‌కు ఈ డేటాను పంపించింది. ఇది గత రికార్డు కంటే దాదాపు 10 రెట్ల వేగంతో ప్రయాణించింది. స్టార్‌లింక్ 6జీ టెక్నాలజీని అభివృద్ధి చేస్తోందన్నది అధికారికం కాదని చైనా సంస్థకు చెందిన లేజర్ గ్రౌండ్ కమ్యూనికేషన్స్ అధిపతి వాంగ్ హాంగ్‌హాంగ్ పేర్కొన్నారు. 'మా టెక్నాలజీ మస్క్‌కు చెందిన కంపెనీని ఈ విషయంలో వెనక్కి నెట్టింది. చేసిందన్నారు. మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ లేజర్ శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థను ఆవిష్కరించింది. కానీ, దానిని శాటిలైట్ టు గ్రౌండ్ కమ్యూనికేషన్‌కు ఇప్పటి వరకు ఉపయోగించలేదు. వారి వద్ద ఈ టెక్నాలజీ ఉండొచ్చు. కానీ, మేము ఇప్పటికే భారీ స్థాయిలో వినియోగించడం మొదలుపెట్టాం' అని వెల్లడించారు. అయితే ఈ కంపెనీ జిలిన్1 శ్రేణిలోని ఉపగ్రహాలను 2027 నాటికి పూర్తి కక్ష్యలోకి చేర్చనుంది. 100 జీబీపీఎస్ డేటా 10 పూర్తిస్థాయిలో సినిమాల సైజులో ఉంటుంది. దీనిని చైనా సంస్థ ఒక్క సెకన్‌లో ట్రాన్స్‌మిట్ చేయగలిగింది. గతంలో అమెరికాకు చెందిన మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నాసాకు చెందిన టెరాబైట్ ఇన్ఫ్రారెడ్ డెలివరీ సిస్టమ్స్ సంస్థ కూడా 100 జీబీపీఎస్ ట్రాన్స్‌మిట్ చేసింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 5జీ కమ్యూనికేషన్స్ వాడుకలో ఉంది. దీనికి ఆధునిక వెర్షన్ 6జీగా ఉంది. దీనిని అత్యధిక ఫ్రీక్వెన్సీ బ్యాండ్స్ వద్ద వినియోగిస్తారు. తాజాగా చైనా 5జీ ఆధారిత అత్యాధునిక మొబైల్ స్టేషన్‌ను అభివృద్ధి చేసినట్లు ప్రకటించింది. ఇది యుద్ధ వాతావరణలో కూడా మూడు కిలోమీటర్ల వ్యాసార్థంలో 10,000 మందికి అత్యంత సురక్షితంగా, వేగవంతంగానూ డేటాను పంపిస్తుంది. దీనిని చైనా మొబైల్ కమ్యూనికేషన్స్ గ్రూప్, ది పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి.



### అసలేంటీ 6జీ నెట్‌వర్క్..?

5జీ నెట్‌వర్క్‌కు అడ్వాన్స్‌డ్ వెర్షనే ఈ 6జీ నెట్‌వర్క్. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 5జీ సేవలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో దేశవ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు సైతం 5జీ సేవలు విస్తరించనున్నట్లు టెలికాం నెట్‌వర్క్ సంస్థలు చెబుతున్నాయి. ఇక 6జీ నెట్‌వర్క్ 5జీ కంటే వెయ్యి రెట్ల వేగంతో పనిచేస్తుంది. టెలికాం విభాగం (డిఓటి) విడుదల చేసిన 6జీ డాక్యుమెంట్ ప్రకారం.. 5జీ నెట్‌వర్క్ సెకనుకు 10 గిగాబైట్స్ వేగంతో పనిచేస్తే.. 6జీ సెకనుకు ఒక టెరాబైట్ వేగంతో పనిచేస్తుంది. ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌ల పరంగా 5జీ ఆపరేటర్లు 24 గిగాహెడ్జ్ నుంచి 66 గిగాహెడ్జ్ స్పెక్ట్రమ్ వేవ్‌లను ఉపయోగిస్తుంటారు. దీనివల్ల డేటా బదిలీ వేగంగా జరుగుతుంది. 6జీ టెక్నాలజీలో మాత్రం స్పెక్ట్రమ్ వేవ్‌లు 30 గిగా హెడ్జ్‌ల నుంచి 300 గిగాహెడ్జ్‌లను దాటి టెరాహెడ్జ్‌ల వరకు ఉపయోగించవచ్చు. ప్రస్తుతం సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు, స్మార్ట్ సిటీలు, రిమోట్ హెల్త్‌కేర్ వంటి సేవల్లో 5జీ నెట్‌వర్క్ కీలకం కానుంది. 6జీ ద్వారా ఈ సేవలు మరింత ఆధునిక సాంకేతికతతో వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయని టెక్నాలజీ నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు 6జీ నెట్‌వర్క్ ద్వారా హెచ్‌డీ క్వాలిటీ కలిగిన 100 సినిమాలను ఒక నిమిషంలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అంతేకాకుండా కారులో లేదా విమానంలో ప్రయాణిస్తూ.. ఫోన్ ద్వారా వేర్వేరు సాంకేతికతలను ఉపయోగించుకునే వెసులుబాటు ఉంటుంది. దీని వల్ల ఎంత దూరంలో ఉన్న డివైజ్‌లనైనా ఫోన్‌తో కంట్రోల్ చేయడంతోపాటు.. ఒకేసారి అధిక సంఖ్యలో వేర్వేరు గ్యాడ్జెట్‌లతో అనుసంధానం కావచ్చు. 6జీ నెట్‌వర్క్ వాస్తవిక ప్రపంచానికి, డిజిటల్ వరల్డ్‌కు మధ్య ఉన్న దూరాన్ని చెరిపేస్తుందని టెక్ నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు 6జీ సేవలను ప్రపంచ దేశాలతోపాటు మన దేశంలోనూ ఏక కాలంలో ప్రారంభించేలా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది.

### భారత్ కూడా..

ప్రస్తుతం దేశంలో 5జీ సాంకేతికత అందుబాటులో ఉందని.. త్వరలోనే 6జీ సాంకేతికతను ) ప్రజలకు పరిచయం చేసేందుకు భారత్ వడివడిగా అడుగులు వేస్తోందని ప్రధాని మోడీ ఇటీవల ప్రకటించారు. ఇందుకోసం ప్రత్యేకంగా 6జీ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రపంచంలో అగ్రగామిగా ఎదగడానికి భారతదేశం 6G సాంకేతికతని ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. టెలికాం సర్వీస్ ప్రొవైడర్స్ (టీఎస్‌పీ)పై ఇటీవల ఏర్పాటు చేసిన స్టేక్‌హోల్డర్ అడ్వైజరీ కమిటీ (ఎస్ఏసీ)తో కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని రెండో సమావేశాన్ని నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ టెలికాం కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్‌ఐడియా, బీఎస్ఎన్ఎల్ ప్రతినిధులతో చర్చలు జరిపింది. 6జీ సేవలను ప్రపంచ దేశాలతోపాటు మన దేశంలోనూ ఏక కాలంలో ప్రారంభించేలా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది.

# రూపాయి పతనం ఆగేదెలా?



**మహా:** రూపాయి పతనం విషయంలో ఇండియా రికార్డుల మీద రికార్డులను సృష్టిస్తోంది. రోజురోజుకు రూపాయి విలువ పడిపోతుంది. గురువారానికి రూ. 85.78కి పడిపోయింది. దీంతో దేశ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దేశ ఆర్థిక పరిస్థితి ఏమవబోతుంది అనే కన్సర్న్ వారిని వెంటాడుతుంది. శ్రీలంక పరిస్థితులు ఇండియాలో కూడా రాబోతున్నాయా? అనే సందేహం జనానికి కలుగుతుంది. గడిచిన ఇరవై ఏళ్ల నుంచి రూపాయి సగటున ప్రతి సంవత్సరం 3.2 శాతం పతనమవుతూ వస్తుందని నిపుణులు చెబుతున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్ లో రూపాయి విలువ మరింత ఘోరంగా పడిపోవడం ఖాయమంటున్నారు. ప్రస్తుత పతనాన్ని బట్టి చూస్తే కొద్ది రోజుల్లోనే రూపాయి పతనం రూ. 100కు పైగా పడిపోయే అవకాశం లేకపోలేదని హెచ్చరిస్తున్నారు. అయితే, పలువురు పేర్కొన్నదాని ప్రకారం... 2005లో రూపాయి పతనం రూ. 43.47గా ఉండగా, అది ప్రతి సంవత్సరం ఇంకా పడిపోతూనే ఉంది. ప్రస్తుతం రూ. 85 దాటింది. ఈ పరిస్థితి ఇంకా అధ్వానానికి పడిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత పరిస్థితి ఎలా ఉండబోతుందోననే కన్సర్న్ ప్రజల్లో వ్యక్తమవుతుంది. రూపాయి ఇలా పడిపోతూ ఉంటే దేశ ఆర్థిక పరిస్థితి కోలుకోని విధంగా తయారవుతుందని చెబుతున్నారు. దీంతో తీవ్ర నష్టం కలుగకమానేట్లు లేదు. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలకు దారీ తీస్తుందని వారు పేర్కొంటున్నారు. కొనుగోలు శక్తి తగ్గి, చమురు దిగుమతి బిల్లు పెరిగి దేశ ప్రజల మీద ఆ ప్రభావం తీవ్రంగా పడుతుందని సూచిస్తున్నారు. ప్రతిదానిపై తీవ్రమైన ప్రభావం పడిపోయి పరిస్థితి పూర్తిగా చిన్నాభిన్నమైపోతుందని పేర్కొంటున్నారు.

'పలు దేశాల్లో ఇంతకన్నా దారుణమైన పరిస్థితులు నెలకొన్నా కూడా వాటిని అధిగమించి ఆర్థికంగా అగ్రగామిగా నిలబడిన సందర్భాలు ఉన్నాయి. అందుకు అవి ప్రత్యేకమైన ప్రణాళికలు వేసుకుని క్రమక్రమంగా అనుసరిస్తూ వచ్చాయి. ఆ తరువాత ఆ దేశాల ఆర్థిక పరిస్థితుల్లో పూర్తిగా మార్పు కనిపించింది. దీంతో ఆ దేశాలు అభివృద్ధిలో ముందు వరుసలో నిలబడి ప్రజలకు మంచి పాలనను అందించాయి. మన దేశంలో కూడా పలు అంశాలకు సంబంధించి ప్రపంచ దేశాల్లో పోటీ పడుతున్నప్పటికీ కరెన్సీ పతనంపై ఎక్కువగా దృష్టి సారించడంలేదు. నిర్మించిన ఒక ఇల్లు స్ట్రాంగ్ గా ఉండాలంటే దానికి పునాదాలు గట్టిగా ఉండేవిధంగా చూసుకుంటాం. అలాంటిదే కరెన్సీ. మరి అటువంటి కరెన్సీ విలువను పతనం కాకుండా అభివృద్ధితోపాటు క్రమక్రమంగా మెరుగుపరుచుకోవాలి' అంటూ పలువురు సూచిస్తున్నారు.



## ట్రాఫిక్ దరిద్రాల్లో.. మన నగరాలే వరల్డ్ వరస్ట్

### ప్రపంచ చెత్తనగరంగా బెంగుళూరు.. తర్వాత పుణె

### టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ సర్వేలో తేలిన నిజం

**మహా:** ట్రాఫిక్.. ఈ పదం వింటేనే చాలా మందికి చిరాకు వస్తుంది. ముఖ్యంగా ప్రతీరోజు ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొనే వారి పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 2 నిమిషాలు ఆగాల్సి వచ్చినా హారన్లు మోగిస్తూ.. తెగ ఆయాస పడిపోతుంటారు. ఎండ, వర్షం వంటివి ఎక్కువైతే మరింత నరకం చూస్తుంటారు. ముఖ్యంగా మవ దేశంలోని అనేక నగరాల్లో ఈ ట్రాఫిక్ సమస్యలు ఉండగా.. బెంగళూరు, పుణే, ముంబయి, ఢిల్లీ వంటి ప్రాంతాల ప్రజలు మరింత ఎక్కువ ట్రాఫిక్‌లోనే గడిపేస్తుంటారు. కనీసం రోజుకు రెండు, మూడు గంటల పాటు ట్రాఫిక్‌లోనే ఇరుక్కుంటారు. ఈ విషయం మేము చెప్పేది కాదండోయ్.. ప్రపంచ వ్యాప్తంగా చేసిన సర్వేలే చెబుతున్నాయి. తాజాగా టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ చేసిన ఓ సర్వే గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం.

టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ నిర్వహించిన ఓ సర్వే ప్రకారం ఆసియాలోనే అత్యంత అధ్వాన్నమైన ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొనే నగరాల్లో భారత దేశంలోనే రెండు నగరాలే అగ్ర స్థానంలో నిలిచాయి. ముఖ్యంగా బెంగళూరు మొదటి స్థానంలో నిలవగా.. పుణే రెండో స్థానంలో నిలిచింది. 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి డ్రైవర్లు సగటున 28 నిమిషాల 10 సెకన్ల పాటు ట్రాఫిక్ లోనే ఉంటున్నారని తెలిపింది.

# రోజుకు ఎన్ని కప్పుల కాఫీ తాగితే మంచిది..?



రోజూ ఉదయం నిద్ర లేవగానే చాలా మంది కాఫీ లేదా టీ సేవిస్తుంటారు. అయితే కాఫీ ప్రేమికులు ప్రత్యేకంగా ఉంటారు. ఉదయం నిద్ర లేచాక వెంటనే గొంతులో కాఫీ పడకపోతే కొందరికి తృప్తిగా అనిపించదు. అలాంటి వారికి కాఫీ తాగకపోతే రోజు ప్రారంభం కాదు. చల్లని వాతావరణంలో వేడి వేడి కాఫీ తాగుతుంటే వచ్చే మజాయే వేరు. ఈ క్రమంలోనే కొందరు స్ట్రాంగ్ కాఫీ తాగుతారు. కొందరు చక్కెర ఎక్కువ వేసి తాగుతారు. అయితే డాక్టర్లు చెబుతున్న ప్రకారం కాఫీని రోజూ పరిమిత మోతాదులో తాగితే ఆరోగ్యకరమైన ప్రయోజనాలే కలుగుతాయట. రోజూ కాఫీని తాగడం వల్ల పలు వ్యాధులను నయం చేసుకోవచ్చని, మన శరీరానికి పలు లాభాలు కలుగుతాయని అంటున్నారు.

### గుండె ఆరోగ్యానికి..

కాఫీలో కెఫీన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది హృదయ సంబంధిత సమస్యలకు ఔషధంగా పనిచేస్తుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. పలు రకాల క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుంది. కాఫీలో పలు పోషకాలు కూడా ఉంటాయి. మెగ్నిషియం, పొటాషియం, విటమిన్ ఇ తదితర పోషకాలతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా కాఫీలో ఉంటాయి. కాఫీలో ఉండే విటమిన్ ఇ యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. ఇది గుండె సంబంధ వ్యాధులు రాకుండా చూస్తుంది. అలాగే పలు రకాల క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుంది. దీంతోపాటు గుండె సమస్యలు రాకుండా చూస్తుంది. కాఫీని రోజూ మోతాదులో తీసుకుంటేనే ఈ లాభాలను పొందగలుగుతారు. అయితే అధ్యయనాలు చెబుతున్న ప్రకారం కాఫీని తాగడం వల్ల ఆందోళన, కంగారు వంటి సమస్యలు కూడా తగ్గుతాయట. ఈ మేరకు ఫరీదాబాద్‌లోని ఏషియన్ హాస్పిటల్ హెడ్ డైటిషియన్ కోమల్ మాలిక్ చెప్పారు.

### ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి..

కాఫీని తాగడం వల్ల మన మూడ్ కూడా మారుతుందని వైద్యులు చెబుతున్నారు. డిప్రెషన్ లేదా మానసిక సమస్యలతో బాధపడుతున్నవారు కాఫీ తాగితే ఆయా సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని అంటున్నారు. కాఫీని తాగడం వల్ల మైండ్ రిలాక్స్ అయి మూడ్ మారుతుంది. అలాగే కాఫీలో ఉండే పాలిఫినాల్స్ శరీరంలో వాపులను తగ్గిస్తాయి. ఇక బరువు తగ్గాలనుకునేవారు కూడా కాఫీని తమ దినచర్యలో భాగం చేసుకోవాలి. ఇక కాఫీని అసలు రోజుకు ఎన్ని కప్పుల వరకు తాగితే మంచిది..? అన్న విషయానికి వస్తే.. వైద్యులు చెబుతున్న ప్రకారం రోజుకు 2 నుంచి 3 కప్పుల వరకు కాఫీని సేవించవచ్చు. అంతకు మించితే మాత్రం ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలగకపోగా సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. కనుక కాఫీని రోజూ నిర్దేశించిన మోతాదులోనే తాగాల్సి ఉంటుంది.

### కెఫీన్ అధికమైతే..?

ఇక కప్పు కాఫీ తాగితే సుమారుగా 100 మిల్లీగ్రాముల మేర కెఫీన్ లభిస్తుంది. మన శరీరానికి రోజుకు 400 మిల్లీగ్రాముల వరకు కెఫీన్ తీసుకోవచ్చు. అంటే సుమారుగా 4 కప్పులు అన్నమాట. కనుక 3 కప్పుల కన్నా మించి కాఫీని సేవించకూడదు. దీంతో శరీరంలో కెఫీన్ పరిమాణం పెరిగిపోతుంది. ఇది ఉండాల్సిన మోతాదులో ఉంటే ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కానీ అధికంగా ఉంటే మాత్రం ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. కనుక కాఫీని రోజుకు 2 లేదా 3 కప్పులకు మించి తాగకూడదు. కాఫీని తాగేవారు అందులో చక్కెర కలపకుండా తాగితే మంచిది. బ్లాక్ కాఫీ తాగితే మధుమేహం ఉన్నవారికి మేలు చేస్తుంది. దీంతో షుగర్ లెవల్స్‌ను అదుపు చేయవచ్చు. అలాగే కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. ఇలా కాఫీని తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

### రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999



నూతన సంవత్సరం సందర్భంగా కరీంనగర్ పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ నందు స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నన్ను మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేయటం జరిగింది. - సత్తుమల్లేష్

# రక్తదానం మహా దానం

## పిట్ట బొంగరంలో రక్తదాన శిబిరానికి హాజరైన కలెక్టర్

### దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపు



**ఆదిలాబాద్, మహా:** రక్తదానం మహా దానమని.. దాతలు రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకురావాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇంద్రవెల్లి మండలం పిట్ట బొంగరం గ్రామంలో నవజ్యోతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తాతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వీరికి గ్రామస్తులు మేళతాళాలతో సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దాదాపుగా 150 మంది స్వచ్ఛందంగా శిబిరానికి వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. అపోహలను వీడి బ్లడ్ డొనేషన్ చేయాలని సూచించారు. రక్తదానం చేయడం వల్ల ప్రాణాలను కాపాడిన వారమవుతామని, ముఖ్యంగా ఎనీమియా, తల సేమియాతోపాటు గర్భిణీలు ప్రసూతి సమయంలో ప్రమాదాల సమయాల్లో రక్తం అవసరమవుతుందని తెలిపారు. మూఢనమ్మకాలను పక్కనపెట్టి రక్తదానం చేసేందుకు గిరిజనులు ముందుకు రావాలని, ప్రతి గ్రామాల్లోనీ యువత వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వాక్రా మహిళలు రక్తదానంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పౌష్టికారలోపాన్ని దృష్టిలో ఉంచుకోవాలని, ఈ గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం, అందుకు స్వచ్ఛందంగా శిబిరానికి వచ్చి రక్తదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఐటీడీఏ పీవో కుష్బూ గుప్త మాట్లాడుతూ రక్తహీనత ఎక్కువగా ఉందని ఎవరు బాధపడనవసరం లేదని అన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలలో అన్నిరకాల పౌష్టికాహారం సరఫరా చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు ఎస్పీ కాజల్,సభ అధ్యక్షులు వెట్టి రాజేశ్వర్ పటేల్, మాజీ ఐటీడీఏ చైర్మెన్ సిడాం భీంరావ్, జిల్లా మేడి మేస్రం దుర్గు పటేల్, మేస్రం వెంకటరావు ,మేస్రం మనోహర్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ డాక్టర్ నరెందర్ రాథోడ్, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్, డీఎమ్ఓ డాక్టర్ శ్రీధర్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీఓ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



## నాగోబా ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్, ఏఎస్పీతో కలిసి ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించారు. ఆలయ సిబ్బంది వారికి సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. నాగోబా దేవతను దర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 28న కేస్లాపూర్ నాగోబా ఆలయంలో మహాపూజతో జాతర ప్రారంభం అవుతుందని, 31న గిరిజన దర్బార్ ఉంటుందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జాతర నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించి దిశా నిర్దేశం చేశారు.

## ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

### మానసిక వికలాంగుల కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ జానకి షర్మిల

**నిర్మల్, మహా:** సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ గ్రామంలో గల శాంతినికేతన్ మానసిక వికలాంగుల కేంద్రంలో నూతన సంవత్సరం, చలి కాలం పురస్కరించుకుని వికలాంగులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగంలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ మీ అందరిని కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంవికే డైరెక్టర్ జనార్ధన్ శనిగారపు చిన్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## రోడ్డు భద్రతపై అవగాహన



**ఆదిలాబాద్, మహా:** రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని, ప్రమాద రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను ముందువరుసలో నిలిపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం నినాదంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్ఎం ముఖ్యఅతిథిగా విచ్చేసి పలు అంశాలపై ఆర్టీసీ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ప్రమాదాలను నివారించి మంచి సేవలు అందించాలని, ఆర్టీసీ ప్రతిష్టతను మరింత పెంచాలని సూచించారు. అటు మాసోత్సవాల నేపథ్యంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారుల సారధి ఆధ్వర్యంలో కళాకారులు తమ ఆటపాటలతో ఉర్రూతలూగించారు.

## చోరీ కేసును 48 గంటల్లో ఛేదించిన నిర్మల్ పోలీసులు

**నిర్మల్, మహా:** నిర్మల్ జిల్లా భైంసా పట్టణ శివారులోని నాగదేవత ఆలయంలో జరిగిన చోరీ ఘటన కేసును 48 గంటల వ్యవధిలో ఛేదించినట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. భైంసాలోని ఎస్పీ క్యాంప్ ఆఫీసులో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. భైంసా మండలం చుచుంద్ గ్రామానికి చెందిన విశాల్, సంఘరతన్ అనే ఇద్దరు స్నేహితులు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గాను డబ్బులు లేకపోవడంతో నాగదేవత ఆలయంలో దొంగతనానికి పాల్పడ్డారన్నారు. ఆలయంలోని హుండీ కానుకలతోపాటు గంటలను సైతం వీరు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి చోరీకి పాల్పడ్డిన ఇద్దరిలో ఒకరి దుస్తులకు పసుపు, కుంకుమ అంటినట్లుగా గుర్తించి అనుమానితుడిగా భావించి విచారణ చేపట్టామన్నారు. ఆ తర్వాత



సంబంధిత వ్యక్తులు ఇద్దరు చోరీకి పాల్పడ్డట్లుగా నిర్ధారించి గురువారం ఉదయం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించారు. 48 గంటల వ్యవధిలో కేసును ఛేదించిన భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, టౌన్ సీఐ గోపినాథ్ తోపాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ జానకీ షర్మిలా అభినందించారు.

## రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



**నిర్మల్, మహా:** రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్ ముర్తుజా అలీ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని నిర్మల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్, బస్ డిపో ఎదుట గురువారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రహదారి భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. వాహన దారులకు రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు భద్రత మాసోత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.



## బహిరంగ ప్రదేశాలలో చెత్తను కాల్చొద్దు


### జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి

**ఇబ్రహీంపట్నం, మహా:** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయం సెనత్ నగర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'బహిరంగ ప్రదేశాలలో చెత్తను కాల్చొద్దు' అంశంపై రూపొందించిన పోస్టర్లను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రాజెక్ట్ అధికారి బి. నాగేశ్వరరావు పాల్గొని చెత్తను కాల్చడం ద్వారా ఆరోగ్యం, వాయు కాలుష్యంపై ప్రభావం పడుతుందన్నారు. రోజువారి చెత్తను తడి పొడిగా వేరు చేసి కంపోస్ట్ ఎరువుగా తయారు చేయడం, పొడి చెత్తను రీసైక్లింగ్ చేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రత పాటించాలన్నారు. చెట్లను పెంచాలి.. పర్యావరణాన్ని రక్షించాలని కలెక్టర్ అన్నారు.

## వైభవంగా కంది ఇషాన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు

### చిన్నారికి బర్త్ డే విషెస్ తెలిపి ఆశీర్వదించిన అతిథులు.. హాజరైన రాజకీయ నేతలు, పుర ప్రముఖులు, అభిమానులు

**ఆదిలాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి మౌనాశ్రీనివాసరెడ్డి దంపతుల ముద్దుల తనయుడు కంది ఇషాన్‌రెడ్డి ద్వితీయ జన్మదిన వేడుకలు పట్టణంలోని రత్నా గార్డెన్‌లో గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా కొనసాగాయి. జన్మదిన వేడుకలకు పెద్దఎత్తున తరలివచ్చిన అతిథుల సమక్షంలో అందంగా ముస్తాబు చేసిన వేదికపై చిన్నారి ఇషాన్ రెడ్డితో కేక్ కట్ చేయించారు. కంది శ్రీనివాసరెడ్డి ఆహ్వానం మేరకు రాజకీయ నాయకులు, అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు, ప్రజలు, పాత్రికేయ మిత్రులతోపాటు ఏఎన్ఎన్, కేఎస్ ఆర్ ఫౌండేషన్ సిబ్బంది హాజరయ్యారు. వచ్చిన అతిథులను కంది శ్రీనివాసరెడ్డి దంపతులు సాదరంగా స్వాగతించారు. అతిథులంతా చిన్నారికి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. వేడుకల నేపథ్యంలో అతిథుల కోసం చక్కటి విందు భోజనం ఏర్పాటు చేశారు. అటు పెద్ద సంఖ్యలో అతిథుల రాకతో సందడి వాతావరణం నెలకొంది.




## ప్రజా పాలనతోనే ప్రజలకు సంక్షేమం



### ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం, జనవరి, మహా:** నూతన సంవత్సరం సందర్భంగా గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్, డైరెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరం ప్రజాపాలనలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా పాలనతోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిగళ్ళ మహిపాల్, కొత్త కుర్మ శివకుమార్, పీఏసీఎస్ ఎదుల్లా పాండురంగారెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, యంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షులు కొత్త కురుమ మంగమ్మ పాల్గొన్నారు.

## మంత్రులను కలిసిన గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్

### న్యూ ఇయర్ విషెస్ తెలిపిన చిలక మధుసూదన్ రెడ్డి

**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి 2, మహా:** తెలంగాణ రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను గురువారం ఉదయం హైదరాబాద్ లోని మంత్రుల నివాస సముదాయంలో వారందరినీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీ చిలుక మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధి, జిల్లాలో పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలపై వారు చర్చించారు.



## హెచ్ఎంపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి: మాదిగ జేఏసీ ప్రతినిధులు

**ఇబ్రహీంపట్నం, జనవరి 2, మహా:** తుక్కుగూడ హెచ్ఎం రాములపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నియోజకవర్గ మాదిగ జేఏసీ ప్రతినిధుల ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థికి హెచ్ఎం కాలు తగిలిందని ఆరోపిస్తూ 2030 మంది దాడి చేసి గాయపరిచారని, పైగా విద్యార్థి కాళ్లు మొక్కించారని విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు.

## ఉపరాష్ట్రపతి అయ్యే అవకాశమున్నా బర్ధన్ వదులుకున్నారు

### ఏబీ బర్ధన్ కమ్యూనిస్టు సైద్ధాంతిక తత్వవేత్త

### సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి

**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి 02, మహా:** సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ కమ్యూనిస్టు సైద్ధాంతిక తత్వవేత్త అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్ర చారి అన్నారు. ఏబీ బర్ధన్ 9వ వర్ధంతి సందర్భంగా రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్3 భూపోరాట కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలు మాట్లాడుతూ.. ఏబీ బర్ధన్ కమ్యూనిస్టు సైద్ధాంతిక తత్వవేత్త అని అన్నారు. ఆయన తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను అనుసరించి ప్రజలతో, కార్యకర్తలతో నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. బర్ధన్ విద్యార్థి దశ నుంచి ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. గతంలో ఉప రాష్ట్రపతి అయ్యే అవకాశం ఉన్నా ఎలాంటి పదవిని ఆశించకుండా సున్నితంగా తిరస్కరించారు. తన జీవితం ప్రజలు, పార్టీ కార్యకర్తలతోనే అని చెప్పడం బర్ధన్ నిస్వార్థతకు అద్దం పడుతోందన్నారు. బర్ధన్ ఆశయ సాధనతో ముందుకు సాగలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, అజ్మీర హరిసింగ్ నాయక్, ఏఐటీయూసీ అబ్దుల్లాపూర్ మెట్ మండల అధ్యక్షులు దాసరి ప్రసాద్ ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేతరాజు నర్సింహ్మా, సైదులు ముదిరాజ్, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, యాదిగిరి, వీరేష్, శంకర్ నాయక్, నరసింహ, మహిళా సమైక్య నాయకురాలు అధ్యక్షురాలు, కాటి అరుణ, దేవమ్మ, సుభద్ర, లక్ష్మి పాల్గొన్నారు.



## సరికొత్త ఆలోచనలతో జిల్లా అభివృద్ధి

### జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి

**ఇబ్రహీంపట్నం, మహా:** 2025 సంవత్సరంలో మరింత పట్టుదలతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో రెట్టింపు ఉత్సహంతో పనిచేసి జిల్లాను మరింత ప్రగతి పథంలోకి తీసుకువెళ్లాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులకు సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి శాఖ తమ పనితీరును మెరుగుపరుస్తూ నాణ్యతను పెంచుతూ కార్యాచరణ సిద్ధం చేసుకుని ముందుకెళ్ళాని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా ప్రజల్లోకి తీసుకెళ్లాడమే మనందరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఉద్యోగి ఈ రంగారెడ్డి జిల్లాలో పనిచేయడం ఒక అదృష్టంగా భావించి తాము తీసుకునే నిర్ణయాలు చేసే పనులు ఎంతో మందికి మేలు జరుతుందని కలెక్టర్ అన్నారు. ప్రతి పనిని పాజిటివ్ ఆలోచనతో చేయాలని.. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని అధిగమించగలమని, కొత్త ఏడాది కొత్త లక్ష్యంతో ముందుకు వెళ్ళినప్పుడే విజయం సాధించగలమని ఆయన తెలియజేశారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని అధికారులకు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్, మండల పంచాయతీ అధికారుల అసోసియేషన్ సహకారంతో సంక్షేమ హాస్టల్ విద్యార్థుల కొరకు 200 బ్లాంకెట్స్, 100 నోట్ బుక్స్ ను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రార్థనా స్థలాల చట్టం అమలుపై ఎంపీ అసదుద్దీన్ పిటీషన్ విచారణకు సుప్రీం ఓకే




**న్యూఢిల్లీ:** 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ఇవాళ అంగీకారం తెలిపింది. 1947, ఆగస్టు 15వ తేదీ నాడు మతపరమైన స్థలాల అంశంలో ఎటువంటి చట్టం అమలులో ఉందో, అదే తరహా విధానాన్ని మెయిన్‌టేన్ చేయాలని ఆ పిటీషన్‌లో కోరారు. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసులో విచారణ చేపట్టింది. ప్రార్థనా స్థలాలకు చెందిన కేసులతో లింకున్న వాటికి అసద్ పిటీషన్‌ను జోడించాలని సుప్రీం ఆదేశించింది. ఫిబ్రవరి 17వ తేదీ ఆ పిటీషన్‌పై విచారణ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఎంపీ అసదుద్దీన్ తరపున అడ్వకేట్ నిజాం పాషా వాదించారు.

## మహా కుంభమేళాలో భక్తులే లక్ష్యంగా బెదిరింపులు..


### అప్రమత్తమైన యూపీ పోలీసులు



జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ (Prayagraj) ముస్తాబవుతోంది. మహా కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే, ఈ కుంభమేళాకు బాంబు బెదిరింపులు రావడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. ఓ ఎక్స్ యూజర్ ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. మతపరమైన ఈ కార్యక్రమానికి హాజరయ్యే కనీసం 1,000 మందిని లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన యూపీ పోలీసులు సదరు ఎక్స్ యూజర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు. కాగా, మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కుంభమేళాలో 45 కోట్లమంది భక్తులు పాల్గొని గంగాస్నానం ఆచరిచేం అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో పాల్గొనే భక్తుల సౌకర్యం కోసం 1,60,000 టెంట్లు, 1,50,000 మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 15,000 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తారు. 1,250 కిలోమీటర్ల పైప్‌లైనును సిద్ధం చేస్తున్నారు. 67 వేల ఎల్ఈడీ లైట్లు, 2 వేల సోలార్ లైట్లు, 3 లక్షల మొక్కలు ఏర్పాటవుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ రిస్ట్‌బ్యాండ్స్, యాప్ ట్రాకింగ్‌లతో భక్తులను లెక్కిస్తారు.

## ట్రక్కును ఢీ కొట్టిన బస్సు

### 30 మందికి గాయాలు




రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. దౌసా జిల్లాలో ఓ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో 30 మందికి గాయాలయ్యాయి. ఢిల్లీ - ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. బస్సు 45 మంది ప్రయాణికులతో ఉజ్జయిని నుంచి ఢిల్లీకి వెళ్తోంది. ఈ క్రమంలో దౌసా జిల్లాలోకి రాగానే బస్సు ప్రమాదానికి గురైంది. ఓ ట్రక్కును బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో 30 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దట్టమైన పొగ మంచు కారణంగానే ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## శరద్ పవార్, తన కుమారుడు కలవాలని దేవుడ్ని ప్రార్థించా: అజిత్ పవార్ తల్లి

**ముంబై:** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ తల్లి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, తన కుమారుడు మళ్లీ కలవాలని దేవుడ్ని ప్రార్థించినట్లు తెలిపారు. తన ప్రార్థనలు ఫలిస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. కొత్త ఏడాది తొలి రోజైన బుధవారం అజిత్ పవార్ తల్లి ఆశాతాయ్ పవార్, పంఢర్‌పూర్‌లోని ప్రసిద్ధ విఠల్, రుక్మిణీ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తన కుమారుడు, విడిపోయిన శరద్ పవార్ మధ్య మళ్లీ సయోధ్య కుదరాలని విఠల్ స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. 'పవార్ కుటుంబంలో ఉన్న మనస్తాపాలన్నీ తొలగిపోవాలని నేను ప్రార్థించా. అజిత్, శరద్ పవార్ మళ్లీ కలవాలని నేను ప్రార్థించా. నా ప్రార్థనలు ఫలిస్తాయని ఆశిస్తున్నా' అని అన్నారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన తర్వాత అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ, ప్రత్యర్థి శరద్ పవార్ వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శరద్ పవార్‌తో తన కుమారుడు మళ్లీ కలవాలని అజిత్ పవార్ తల్లి ఆశాతాయ్ పవార్ బహిరంగంగా ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకున్నది. ఎన్సీపీలో కీలక నేత ప్రఫుల్ పటేల్ కూడా దీనిపై స్పందించారు. 'శరద్ పవార్ మాకు దేవుడు లాంటివారు. పవార్ కుటుంబం ఏకమైతే నేను చాలా సంతోషిస్తా' అని మీడియాతో అన్నారు.

## శబరిమలలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు.. 3.4 లక్షల చెట్లు కూల్చేస్తేనే!




**తిరువనంతపురం:** శబరిమల సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్నినిర్మించేందుకు ప్రణాళికలు వేశారు. అయితే ఆ విమానాశ్రయం కోసం సుమారు 3.4 లక్షల చెట్లను తొలగించాల్సి ఉంటుందని కొట్టాయం జిల్లాశాఖ ఓ నివేదికను తయారు చేసింది. దీని కోసం సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నివేదికను రూపొందించారు. ఒకవేళ ఎయిర్‌పోర్టు నిర్మిస్తే సుమారు 353 కుటుంబాలను తరలించాల్సి వస్తుందని రిపోర్టులో పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం 3.3 లక్షల రబ్బరు, 2492 టేకు, 2247 వైల్డ్ జాక్, 1131 జాక్‌ఫ్రూట్, 828 మహోగని, 184 మామిడి చెట్లను తొలగించాల్సి ఉంటుంది. చెట్లతో పాటు ఆ ప్రాంతంలో ఉన్న ఏడు మతపరమైన ప్రదేశాలను మార్చాల్సి వస్తోందని రిపోర్టులో తెలిపారు. శబరిమల గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు ద్వారా 347 కుటుంబాలు నేరుగా నష్టపోనున్నారు. దీంట్లో 238 కుటుంబాలు చెరువెల్లి ఎస్టేట్‌లో పనిచేస్తున్నారు. ఇక్కడే చెరువెల్లి జాతి ఆవు కూడా కనిపిస్తుంది. ఒకవేళ ఎస్టేట్‌ను మార్చేస్తే, అప్పుడు ఆవుల పరిస్థితి దయనీయంగా ఉంటుందని రిపోర్టులో వెల్లడించారు. శబరిమల విమానాశ్రయం కోసం 1039.876 హెక్టార్ల భూమి అవసరం ఉంటుంది. ఆ భూమిని మణిమాల, ఎరుమేలి సౌత్ గ్రామాల నుంచి సేకరించనున్నారు. శబరిమల యాత్రికులు, ఎన్ఆర్ఐలు, పర్యాటకులు, ఇతర ప్రయాణికుల ఉద్దేశంతో కేఎస్ఐడీసీ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు. శబరిమల ఎయిర్‌పోర్టుతో ట్రావెన్‌కోర్ యాత్రా స్థలాలకు వెళ్లే మార్గాలకు దారి సులువు అవుతుంది. వావరు మసీదు, మారమన్ కన్వెన్షన్, ఎటుమన్నూర్ మహాదేవ ఆలయం లాంటి ప్రదేశాలకు యాక్సిస్ పెరుగుతుంది. స్థానికంగా ఆర్థిక వ్యవస్థ బలపడనున్నది. టూరిస్టుల సంఖ్య పెరగనున్నది. కుమరొక్కం బ్యాక్‌వాటర్స్, మున్నార్ హిల్ స్టేషన్స్, గావి ఫారెస్ట్, టెక్కడీ వైల్డ్‌లైఫ్ సాంక్చరీ, పెరియార్ టైగర్ రిజర్వ్, ఇడుక్కి డ్యామ్‌కు లింకు రోడ్డు ఈజీ అవుతుంది.



## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు..


### 80కిపైగా విమానాలు ఆలస్యం

దేశ రాజధాని ఢిల్లీలో దట్టమైన పొగమంచు ఆవహించింది. గురువారం ఉదయం ఢిల్లీ సహా పొరుగు రాష్ట్రాల్లో దట్టంగా పొగ కమ్మేసింది. దీంతో విజిబిలిటీ దాదాపు సున్నాకి పడిపోయింది. ముందు వెళ్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకర స్థాయిలో కొనసాగుతున్న వాయు కాలుష్యానికి తోడు పొగమంచు రాజధాని వాసులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం 10 గంటలైనా సూర్యుడు కనిపించని పరిస్థితి. గురువారం ఉదయం ఢిల్లీలో ఉష్ణోగ్రతలు 7.6 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. పొగమంచు వల్ల ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. సాధారణంగా రన్‌వే విజిబిలిటీ 200 నుంచి 500 మీటర్ల మధ్య ఉంటుంది. అయితే, సాధారణ దృశ్యమానత ఇవాళ ఉదయం సున్నాకు పడిపోయింది. దీంతో ఢిల్లీకి రాకపోకలు సాగించే దాదాపు 80కిపైగా విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడుతోంది. ఫ్లైట్‌రాడార్24 ప్రకారం.. కనీసం 80 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇప్పటి వరకూ ఐదు విమానాలు రద్దయ్యాయి.

## తమిళనాడులో వెయ్యి కోట్ల సైబర్ మోసం

### పశ్చిమ బెంగాల్‌లో ఈడీ సోదాలు

**కోల్‌కతా:** తమిళనాడులో సుమారు వెయ్యి కోట్ల సైబర్ మోసం జరిగింది. అయితే ఆ కేసుకు సంబంధించిన తనిఖీలు పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు బెంగాల్‌లోని 8 ప్రదేశాల్లో సోదాలు చేపడుతున్నారు. కోల్‌కతాలో పార్క్ స్ట్రీట్, సాల్ట్ లేక్, బగుహతి ఏరియాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. మరో జిల్లాలోని మూడు ప్రదేశాల్లో సోదాలు చేపడుతున్నారు. సాల్ట్ లేక్ ఏరియాలో ఇవాళ జరిగిన తనిఖీల్లో.. ఈడీ అధికారులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. బగుహతి ఏరియాలో ఉన్న ఓ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో తనిఖీలు జరుగుతున్నట్లు ఈడీ అధికారి తెలిపారు. ఈశాన్య భారత్‌కు చెందిన పలు రాష్ట్రాల వ్యక్తులు ఈ క్రైంలో పాల్గొన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



## జనవరి 3న రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

### ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్:** సావిత్రిబాయి పూలే జయంతిని 'మహిళా టీచర్స్ డే' గా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. నేటి నుంచి ప్రతి ఏటా జనవరి 3న రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మహిళా టీచర్స్ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించింది. కాగా, సాయిత్రిబాయి పూలే జయంతిని ఇప్పటికే జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్న విషయం విధితమే.



### ట్రాఫిక్‌జామ్‌లో ఆసియాలోనే బెంగళూరు టాప్..

## ఏడాదికి 132 గంటలు రోడ్డుపైనే..!

మన దేశంలో ట్రాఫిక్ జామ్ అంటే ముందుగా గుర్తొచ్చేది కర్ణాటక రాజధాని బెంగళూరు మహానగరమే. స్వల్ప దూరానికే గంటలు గంటలు వేచి చూడటం నగర పౌరులకు నిత్యం అనుభవమే. వాహనాల ట్రాఫిక్‌తో ప్రయాణం నరకప్రాయంగా ఉండే నగరాల జాబితాలో బెంగళూరుది దేశంలోనే అగ్రస్థానం. ఇప్పుడు ట్రాఫిక్ జామ్ పరంగా ఆసియాలోనే టాప్ 10 నగరాల జాబితాలో బెంగళూరు మొదటిస్థానంలో నిలిచింది. టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ 2023 ప్రకారం.. ఆసియాలోనే అత్యంత రద్దీగా ఉండే టాప్ 10 నగరాల జాబితాలో బెంగళూరు తొలి స్థానంలో నిలిచింది. ఇక్కడ పీక్ అవర్స్‌లో కేవలం 10 కిలోమీటర్ల దూరానికే ఏకంగా 28 నిమిషాల 10 సెకన్ల సమయం పడుతుంది. అంటే ఈ టెక్‌హబ్‌లోని నివాసితులు ఏటా దాదాపు 132 గంటలపాటు ట్రాఫిక్ జామ్‌లోనే చిక్కుకుపోతారు.

అందుకు కారణంగా బెంగళూరులో రద్దీకి తోడు నగరం వేగంగా విస్తరిస్తుండటమే. దక్షిణ, ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా బెంగళూరుకే వెళ్తుంటారు. ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ అక్కడే నివసిస్తుంటారు. దీంతో పట్టణం కూడా బాగా విస్తరిస్తోంది. మరోవైపు ఈ సిలికాన్ సిటీలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పాలకులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం రావడం లేదు. నగర రోడ్లలో ప్రయాణం నరకయాతంగా మారిపోయింది. ఇక పీక్స్ అవర్స్, హాలిడేస్‌లో ట్రాఫిక్‌ను తప్పించుకోవడం పెద్ద టాస్క్‌గా మారింది.

ఇక ఈ జాబితాలో బెంగళూరు తర్వాత పూణె రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ 10 కిలోమీటర్ల దూరానికి 27 నిమిషాల 50 సెకన్ల సమయం పడుతోంది. ఆ తర్వాత ఫిలిప్పీన్స్‌లోని మనీలా (27 నిమిషాల 20 సెకన్లు) , తైవాన్‌లోని తైచుంగ్ (26 నిమిషాల 50 సెకన్లు), జపాన్‌లోని సప్పోరో (26 నిమిషాల 50 సెకన్లు), తైవాన్‌లోని Kaohsiung City (26 నిమిషాలు), జపాన్‌లోని నగోయా (24 నిమిషాల 20 సెకన్లు), ఇండొనేషియాలోని జకార్తా (23 నిమిషాల 20 సెకన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

టామ్‌టామ్ ట్రాఫిక్ సూచిక 6 ఖండాల్లోని 55 దేశాల్లో ఉన్న 387 నగరాల మీద రీసెర్చ్ చేసి నివేదిక విడుదల చేసింది. నగరాల్లో సగటు ప్రయాణ సమయం, ఇంధన ఖర్చులతోపాటు మరికొన్ని అంశాలను ఆధారంగా చేసుకొని నివేదికను సిద్ధం చేసింది. ఇక ప్రపంచ వ్యాప్తంగా చూస్తే యూకేలోని లండన్ అత్యంత నెమ్మదిగా వాహనాలు కదిలే నగరంగా నిలిచింది. ఇక్కడ సగటున 10 కిలోమీటర్ల దూరానికి 37 నిమిషాల 20 సెకన్ల సమయం పడుతుంది.

## బెంగాల్‌లో చొరబాట్లకు కేంద్రం పాత్ర..

### బంగ్లాదేశీయులను బీఎస్ఎఫ్ అనుమతిస్తోంది: మమతా బెనర్జీ



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ రాష్ట్రంలోకి చొరబాట్లకు కేంద్ర ప్రభుత్వం ముఖ్య పాత్ర పోషిస్తున్నదని విమర్శించారు. అందుకే బంగ్లాదేశీయుల చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతిస్తున్నదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానిది 'నీచమైన బ్లూప్రింట్' అని మండిపడ్డారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు బెంగాల్‌లో శాంతికి విఘాతం కలిగిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల ఆరోపించారు. అలాగే ఓటు బ్యాంకు కోసం బంగ్లాదేశీయులకు సంబంధిత పత్రాలను టీఎంసీ అందజేస్తున్నదని, వారి చొరబాట్లకు సహకరిస్తున్నదని బీజేపీ విమర్శించింది. కాగా, గురువారం అధికారులతో సమావేశం సందర్భంగా సీఎం మమతా బెనర్జీ ఈ ఆరోపణలపై స్పందించారు. రాష్ట్రాన్ని అస్థిరపరిచేందుకు బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను కేంద్ర బలగాలు అనుమతిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రం 'నీచమైన బ్లూప్రింట్' అమలు చేస్తున్నదని విమర్శించారు. 'వివిధ ప్రాంతాల నుంచి బెంగాల్‌లోకి చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతిస్తోంది. మహిళలను చిత్రహింసలకు గురిచేస్తోంది. సరిహద్దులను టీఎంసీ కాపాడటం లేదు. సరిహద్దు మా చేతుల్లో లేదు. కాబట్టి చొరబాట్లను టీఎంసీ అనుమతించిందని ఎవరైనా ఆరోపిస్తే, అది బీఎస్ఎఫ్ బాధ్యత అని నేను ఎత్తి చూపుతా' అని అన్నారు. మరోవైపు సరిహద్దులో చొరబాట్ల గురించి రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్రం వద్ద కూడా సమాచారం ఉందని మమతా బెనర్జీ తెలిపారు. డీజీపీ రాజీవ్ కుమార్‌తోపాటు స్థానిక వర్గాల నుంచి తనకు సమాచారం అందిందని చెప్పారు. దీని గురించి కేంద్రానికి ఘాటుగా లేఖ రాస్తానని అన్నారు. అలాగే చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతించే ప్రాంతాలను గుర్తించి దర్యాప్తు చేయాలని డీజీపీని ఆదేశిస్తానని స్పష్టం చేశారు. కాగా, పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో శాంతి నెలకొనాలని ఆశిస్తున్నట్లు మమతా బెనర్జీ తెలిపారు. 'మాకు శత్రుత్వం లేదు. కానీ గూండాలను ఇక్కడకు అనుమతిస్తున్నారు. వారు నేరాలకు పాల్పడి సరిహద్దు దాటి తిరిగి వస్తున్నారు. ఈ చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతిస్తోంది. ఇందులో కేంద్రం పాత్ర కూడా ఉంది' అని అన్నారు. బెంగాల్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు ఆజ్యం పోసే ప్రయత్నం ఎవరైనా చేస్తే నిరసనలు తప్పవంటూ కేంద్రాన్ని హెచ్చరించారు.



## కష్టమర్లను ఆకట్టుకునేందుకు..
# ఈవీలపై రాయితీల వర్షం

**టాటా, మహీంద్రా, హీరో, ఏథర్ వాహనాలు చౌక**
**పాపులర్ మాడళ్లపై రూ.3 లక్షల వరకు డిస్కౌంట్లు**

**న్యూఢిల్లీ :** విద్యుత్తు ఆధారిత వాహన (ఈవీ) ధరలు దిగొస్తున్నాయి. మార్కెట్‌లోని టాప్ కంపెనీలు తమ పాపులర్ మాడళ్లపై భారీ రాయితీలను ప్రకటించాయి. టాటా, మహీంద్రా, హీరో, ఏథర్ సంస్థలు ఆయా ఈవీలపై ఏకంగా రూ.3 లక్షలదాకా రేట్లను తగ్గించడం విశేషం. డిస్కౌంట్లున్న ఈవీల్లో కార్లు, బైకులు కూడా ఉండటం గమనార్హం. సంప్రదాయ ఇంధన (పెట్రోల్ లేదా డీజిల్) ఆధారిత వాహనాలు కాలుష్యానికి దారి తీస్తున్న నేపథ్యంలో అటు వాహనదారులు, ఇటు ప్రభుత్వాలు ఈవీల కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే గత కొన్నేండ్లుగా ఆటో అమ్మకాల్లో ఈవీల వాటా సైతం పెరిగింది. అయినప్పటికీ ఈవీలపై తయారీదారులు పెద్ద ఎత్తున డిస్కౌంట్లు ప్రకటించడం మారిన మార్కెట్ పరిస్థితులకు అద్దం పడుతున్నది.

**ఇదీ సంగతి..**


డిమాండ్‌కు మించి పెరిగిన ఉత్పత్తి, డీలర్ల వద్ద పేరుకుపోయిన వాహన నిల్వలు, తగ్గిన విడిభాగాల ధరలు.. మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వెహికిల్స్ రేట్లపై డిస్కౌంట్లకు కారణమయ్యాయి. కొత్తగా వచ్చిన కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయెల్ ఎఫీషియెన్సీ (కేఫ్) రెగ్యులేషన్లు కూడా ఇప్పుడున్న మాడళ్లపై ధరల తగ్గింపు దిశగా కంపెనీలను నడిపించాయని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలోనే టాటా నెక్సాన్, మహీంద్రా ఎక్స్‌యూవీ400, హీరో వీ1 ప్రోవీ1 ప్లస్, ఏథర్ 450 రిజ్టా మాడళ్లు చౌకయ్యాయని పేర్కొంటున్నాయి. చివరకు ఆన్‌లైన్ మార్కెటీర్ ఫ్లిప్‌కార్ట్ కూడా ఎలక్ట్రిక్ టూవీలర్లపై రూ.2,5005,000 మేర ధరల్ని తగ్గించేసింది. ఇక ఈ డిస్కౌంట్లలో ఎక్కువ భాగం వాహన తయారీ సంస్థలు భరిస్తుండగా, మిగతా వాటాను డీలర్లు మోస్తున్నారు. ఎక్స్ఛేంజ్ బోనస్‌లు రూ.15,000 వరకు ఇస్తుండగా, ట్రేడ్ డిస్కౌంట్లు రూ.3,0005,000 మధ్య ఉన్నాయి. మొత్తానికి దసరా, దీపావళి, క్రిస్మస్, న్యూ ఇయర్ జోష్‌ను అందిపుచ్చుకున్న వాహన రంగ కంపెనీలు.. పొంగల్, సంక్రాంతి ఉత్సాహాన్నీ క్యాష్ చేసుకోవాలని చూస్తున్నాయి. ఈ ఏడాది దేశీయ మార్కెట్‌లోకి ఏకంగా 15 కొత్త ఈవీలు రావచ్చని సమాచారం. అందులో మారుతీ సుజుకీ నుంచి ఈవిటారా కూడా ఉండొచ్చని తెలుస్తున్నది. ఇక ఇప్పటికే దేశీయ ఈవీ మార్కెట్‌ను శాసిస్తున్న టాటా మోటర్స్ నుంచి సఫారీ, హారియర్ ఈవీ రకాలు రావచ్చని అంటున్నారు. అలాగే సియెర్రా ఈవీ పరిచయం కాబోతున్నట్టు చెప్తున్నారు.

# జీఎస్టీ వసూళ్లు 1.77 లక్షల కోట్లు

**గతంతో పోల్చితే డిసెంబర్‌లో 7.3 శాతం వృద్ధి**

**న్యూఢిల్లీ :**
వస్తు, సేవల పన్ను వసూళ్లు అంతకంతకు పెరుగుతున్నాయి. గడిచిన సంవత్సరం చివరి నెలలో రూ.1.77 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. దీంట్లో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.32,836 కోట్లు వసూలవగా, స్టేట్ జీఎస్టీ కింద రూ.40,499 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ. 47,783 కోట్లు, సెస్ రూపంలో రూ.11, 471 కోట్లు వసూలయ్యాయి. అలాగే రూ.22,490 కోట్లు రిఫండ్ రూపంలో చెల్లింపులు జరిపింది.

మొత్తంగా డిసెంబర్‌లో రూ.1.77 లక్షల కోట్లు వసూలైనట్లు, క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.1.65 లక్షల కోట్లతో పోలిస్తే 7.3 శాతం అధికమని పేర్కొంది. దీంట్లో దేశీయంగా జరిపే లావాదేవీలపై విధించిన జీఎస్టీతో రూ.1.32 లక్షల కోట్లు సమకూరగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధిస్తున్న పన్నులతో మరో రూ.44,268 కోట్లు సమకూరాయి. నవంబర్ నెలలో రూ.1.82 లక్షల కోట్ల పన్ను వసూలైంది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ఏప్రిల్ 2024లో అత్యధికంగా రూ.2.10 లక్షల కోట్లు వసూలయ్యాయి.






## తోళ్ల పరిశ్రమ అభివృద్ధికి సీఎల్ఆర్ఐతో జట్టు..
# రాష్ట్రంలో ఆరు లెదర్ పార్క్‌లు


**ఆరు లెదర్ పార్కుల అభివృద్ధికి చర్యలు**

**హైదరాబాద్:** రాష్ట్రంలో ఆరు లెదర్ పార్క్‌ల ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఇందులోభాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చ్ (సీఎస్ఐఆర్) అనుబంధ సంస్థ సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎల్ఆర్ఐచెన్నై)తో తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ (టీజీఎల్ఐపీసీ)తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ఆరు లెదర్ పార్క్‌ల ఏర్పాటునకు సంబంధించి అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కూడా రూపొందించారు. ఈ లెదర్ పార్క్‌ల్లో తోలు వస్తువులు, దుస్తులు, ఫర్నీచర్, ఫుట్‌వేర్ తదతర ఉత్పత్తులు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తాజాగా పోలేపల్లి (మహబూబ్‌నగర్), దండేపల్లి (నల్గొండ), మందమర్రి (మంచిర్యాల), జింకుంట (నాగర్‌కర్నూల్), రుక్మాపూర్ (కరీంనగర్), మల్లెమడుగు (ఖమ్మం) తదితర ఆరు లెదర్‌పార్క్‌ల అభివృద్ధికి ప్రభుత్వం సీఎల్ఆర్ఐతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. పీపీపీ పద్ధతిన వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

**బీఆర్ఎస్ హయాంలోనే ప్రణాళికలు..**

**బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రంలో పశువులు, గొర్రెల జనాభా గణనీయంగా పెరిగిన విషయం విధితమే. దీంతో మాంస వినియోగం, ఉత్పత్తిలో భారీగా వృద్ధి నమోదైంది. ముడి సరుకు కొరత లేకపోవడంతో తోళ్ల పరిశ్రమను అభివృద్ధి చేయడం ద్వారా వివిధ తోలు ఉత్పత్తులు ఇక్కడే తయారు చేయాలని గత బీఆర్ఎస్ సర్కారు నిర్ణయించింది. దీంతో వేలాదిమందికి ఉపాధి లభించే అవకాశం ఉండటంతో టీజీ ఎల్ఐపీసీవో ఆధ్వర్యంలో పీపీపీ పద్ధతిలో లెదర్‌పార్క్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో 53 ఎకరాల్లో మెగా లెదర్ క్లస్టర్‌తోపాటు భూమి లభ్యత ఉన్న 12ప్రాంతాల్లో లెదర్‌పార్క్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది గత సర్కారు. వీటికి అవసరమైన భూములను కూడా సిద్ధం చేసింది.**

## క్రీడా వార్తలు | SPORTS NEWS



## డ్రెసింగ్ రూమ్‌లో
# లుకలుకలు..!

**కీలక వ్యాఖ్యలు చేసిన హెడ్‌కోచ్ గంభీర్..!**

సిడ్నీ టెస్టుకు ముందు డ్రెస్సింగ్ రూమ్‌లో చర్చలు లీక్ కావడంపై టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో శుక్రవారం నుంచి భారత్‌ఆస్ట్రేలియా మధ్య బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా చివరి టెస్ట్ జరుగనున్నది. అయితే, ఈ టెస్టుకు ముందు కోచ్, ఆటగాళ్ల మధ్య జరిగిన చర్చలు మీడియాకు లీక్ కావడంపై గంభీర్ అంసతృప్తి వ్యక్తం చేశాడు. ఇది అంత మంచి విషయం కాదని హెడ్‌కోచ్ పేర్కొన్నాడు. మెల్నబోర్డ్ టెస్టులో పరాజయం అనంతరం డ్రెసింగ్ రూమ్‌లో ఆటగాళ్ల తీరుపై గంభీర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. వ్యూహం ప్రకారం ఆడలేదంటూ ఆటగాళ్లపై మండిపడ్డట్లుగా వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకు చేసింది చాలు అంటూ ఘరమైనట్లుగా ప్రచారం జరిగింది. సీనియర్లపై సైతం తీవ్రంగానే తప్పుపట్టినట్లు జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఐదు టెస్టుల సిరీస్‌లో ప్రస్తుతం టీమిండియా 12 తేడాతో వెనుకపడింది.

ఐదె టెస్టుకు ముందు జరిగిన విలేకరుల సమావేశంలో గంభీర్ మాట్లాడుతూ.. కోచ్, ఆటగాళ్ల మధ్య డ్రెస్సింగ్ రూమ్ చర్చలు.. అక్కడికే పరిమితం కావాల్సిందేనని, అవి బయటకు రాకూడదని స్పష్టం చేశాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో మాట్లాడుకునేది ఆటగాళ్ల ప్రదర్శనపైనేనని.. ఆటతీరుపై నిజాయితీగానే అక్కడ చర్చిస్తామని తెలిపాడు. ఇది చాలా కీలకమైందని హెచ్‌కోచ్ పేర్కొన్నారు. డ్రెస్సింగ్ రూమ్‌లో నిజాయితీ పరులు ఉన్నంత వరకు భారత క్రికెట్ సేఫ్ హ్యాండ్స్‌లో ఉంటుందని వ్యాఖ్యానించాడు. ఆటగాళ్లు జట్టులో ఒకే విషయం ఉంచగలదని.. అదే ప్రదర్శన మాత్రమేనని స్పష్టం చేశాడు. జట్టుకు టీమ్ స్పిరిట్ అనేది చాలా ముఖ్యమని తెలిపాడు. జట్టు ఏయే విషయాలపై పని చేయాలన్నది ప్రతి ఒక్కరికీ తెలుసునని.. టెస్టులు ఎలా గెలవాలన్న దానిపైనే తాము చర్చించామని.. సీనియర్ ప్లేయర్స్ రోహిత్, విరాట్‌తోనూ వ్యక్తిగతంగా మాట్లాడలేదని గంభీర్ క్లారిటీ ఇచ్చాడు.

**ఓరుగల్లు ముద్దుబిడ్డ**
# జీవాంజి దీప్తికి అర్జున అవార్డు

**హైదరాబాద్:** పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన ఓరుగల్లు ముద్దుబిడ్డ, పారా అథ్లెట్ జీవాంజి దీప్తికి అర్జున అవార్డు వరించింది. దీంతో జీవాంజి దీప్తితో పాటు ఆమె కుటుంబ సభ్యులు, వరంగల్ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. జీవాంజి దీప్తికి శుభాకాంక్షలు వెలువెత్తుతున్నాయి. ఈ నెల 17వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అర్జున అవార్డును జీవాంజి దీప్తి అందుకోనున్నారు. ఇవాళ కేంద్రం ప్రకటించిన జాతీయ క్రీడా అవార్డుల్లో జీవాంజి దీప్తికి చోటు దక్కింది. నలుగురికి ఖేల్‌రత్న, 32 మందికి అర్జున అవార్డులు, ఐదుగురికి ద్రోణాచార్య అవార్డులను కేంద్రం ప్రకటించింది. మూడో స్థానంలో నిలిచింది. ప్రపంచ రికార్డుతో కాంస్య పతకాన్ని సాధించింది. తెలంగాణకు తొలిసారిగా ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించి పెట్టింది. దీప్తి స్వస్థలం వరంగల్ జిల్లా కల్లెడ గ్రామం.




# ఆ నలుగురికి ఖేల్‌రత్న అవార్డులు ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ :** భారత అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ విజేత గుకేష్‌కు, షూటింగ్‌లో ఒలింపిక్స్ పతక విజేత మను బాకర్‌కు, హాకీ క్రీడాకారుడు హర్మన్‌ప్రీత్‌సింగ్‌కు, పారా ఒలింపిక్స్ స్వర్ణ పతకం విజేత ప్రవీణ్ కుమార్‌కు ఖేల్‌రత్న అవార్డులు వరించింది. 17 మంది పారా అథ్లెట్లు సహా 32 మందికి అర్జున అవార్డులు, ఐదుగురికి ద్రోణాచార్య అవార్డులు దక్కాయి. ఈ నెల 17న ఖేల్‌రత్న అవార్డులను రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఈ నలుగురు కేంద్రానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# వరంగల్ ముద్దుబిడ్డకు సీఎం రేవంత్ వరాల జల్లు

**హైదరాబాద్, మహా:** పారా ఒలింపిక్స్ లో సత్తా చాటి భారత్‌కు కాంస్య పతకం సాధించిన వరంగల్ యువతి పారా అథ్లెట్ జీవాంజి దీప్తికి కేంద్ర ప్రభుత్వం అర్జున అవార్డుతో సత్కరించింది. తాజాగా ప్రకటించిన జాతీయ క్రీడా పురస్కారాల్లో ఇటీవల దేశానికి అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధించి, దేశ గౌరవాన్ని పెంచిన వివిధ విభాగాల్లోని అథ్లెట్లను గౌరవిస్తూ.. క్రీడా పురస్కారాలు ప్రకటించగా.. అందులో తెలంగాణకు చెందిన జీవాంజి దీప్తిని చోటు కల్పించింది. గతేడాది ఆగష్టు - సెప్టెంబర్ మధ్య పారిస్ లో నిర్వహించిన పారాలింపిక్స్ లో భారత్ తరఫున 400 మీటర్ల టీ20 పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఈ కేటగిరీలో పతకం సాధించిన మొట్టమొదటి పారా అథ్లెట్‌గా జీవాంజీ దీప్తీ గుర్తింపు సాధించింది. కాగా.. ఆమె కృషికి గుర్తింపుగా కేంద్రం తాజాగా అర్జున అవార్జును ప్రకటించింది. కాగా.. ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును అందించనున్నారు. విశిష్ట క్రీడా పురస్కారం ప్రకటనతో ఆమె కుటుంబ సభ్యులు



ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. కేంద్రం నలుగురికి ఖేల్‌రత్న, 32 మందికి అర్జున అవార్డులను ప్రకటించగా.. మరో ఐదుగురికి ద్రోణాచార్య అవార్డుల ప్రకటించింది.

**రేవంత్ రెడ్డి అభినందనలు**

జీవాంజీ దీప్తికి కేంద్ర క్రీడా అవార్డు రావడంతో స్పందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రత్యేక అభినందనలు తెలిపారు. తెలంగాణ యువ అథ్లెట్, వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ దీప్తి జీవాంజికి విశిష్ట క్రీడా పురస్కారం అర్జున అవార్డు రావడం సంతోషంగా ఉందన్న రేవంత్ రెడ్డి.. ఆమెకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రోత్సాహకాల్ని ప్రకటించారు. జీవాంజి పతకం సాధించినప్పుడే స్పందించి.. రూ. 1 కోటి రూపాయల ప్రోత్సాహం ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి, కోచ్ నాగపురి రమేష్ కి రూ.10 లక్షల నగదు బహుమతిని గతంలోనే అందజేశారు.

# ప్రారంభమైన రాజమౌళి–మహేశ్‌బాబు ప్రాజెక్ట్ ..!

టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. SSMB29 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలెక్కుతుందా అని అటు బాబు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ తెగ ఎదురుచూస్తున్నారు. అయితే తాజాగా ఈ సినిమా పూజ కార్యక్రామలు జరుపుకున్నట్లు తెలుస్తుంది. గురువారం ఈ సినిమాకు సంబంధించిన వేడుక హైదరాబాద్‌లో జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. మహేశ్ బాబు ఫ్యామిలీ, రాజమౌళి ఫ్యామిలీతో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ వేడుకకు హాజరవ్వగా.. ప్రైవేట్‌గా ఈ ప్రాజెక్ట్‌ను లాంచ్ చేసినట్లు తెలుస్తుంది. హాలీవుడ్ సినిమాను తలపించేలా ఈ సినిమా ఉండబోతుందని రాజమౌళి ఈ సినిమా గురించి ఇప్పటికే హింట్ ఇచ్చాడు. దీంతో మూవీ ఎలా ఉండబోతుందని అందరూ ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. మరోవైపు ఈ సినిమాను రూ.1000 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించబోతున్నట్లు సమాచారం. యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందనున్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.




## విడుదల తేదీ ప్రకటించిన సుకుమార్ కుమార్తె అవార్డు విన్నింగ్ మూవీ..!

టాలీవుడ్ స్టార్ దర్శకుడు సుకుమార్, శ్రీమతి తబితా సుకుమార్ దంపతుల కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం గాంధీ తాత చెట్టు. ఈ సినిమా ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాను రిపబ్లిక్ డే కానుకగా జనవరి 24న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు వెల్లడించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌తో పాటు గోపీ టాకీస్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మించాయి. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, శేష సింధు రావులు నిర్మాతలు. పద్మావతి మల్లాది దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి తబితా సుకుమార్ సమర్పకురాలిగా వ్యవహరించారు.

పర్యావరణ పరిరక్షణ ముఖ్య ఉద్దేశంగా తెరకెక్కిన ఈ సందేశాత్మక చిత్రంలో నటనకు గాను దుబాయ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, దాదా సాహెబ్ ఫాల్కే, ఇండియన్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ తొలి సినిమా బాలనటిగా సుకృతి వేణి బండ్రెడ్డి అవార్డు అందుకుంది. ఇవే కాకుండా.. 11వ నోయిడా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్లో ఉత్తమ చిత్రంగా, న్యూఢిల్లీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జ్యూరి బెస్ట్ ఫిలింగా, ఉత్త ప్రాంతీయ చిత్రంగా అవార్డులు అందుకోగా, జైపూర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌తో పాటు 8వ ఇండియన్ వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ జ్యూరీ ఫిలింగా గాంధీ తాత చెట్టు అవార్డులు అందుకోవడం విశేషం. ఇవి కాకుండా పలు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్ నుండి ఈ చిత్రానికి ఆహ్వానాలు అందుతున్నాయి.





## పెళ్లి చేసుకున్న బుట్ట బొమ్మ సింగర్ అర్మాన్ మాలిక్

బుట్ట బొమ్మ సాంగ్ ఫేం బాలీవుడ్ సింగర్ అర్మాన్ మాలిక్ పెళ్లి బంధంలోకి అడుగుపెట్టాడు. తన చిరకాల స్నేహితురాలు ఇన్‌ఫ్లుయెన్సర్ ఆష్నా ష్రాఫ్‌ను వివాహం చేసుకున్నాడు. అర్మాన్ మాలిక్ ఆగస్ట్ 2023లో ఆష్నా ష్రాఫ్‌కి ప్రపోజ్ చేశాడు. దీంతో ఆగష్టులోనే ఈ జంట నిశ్చితార్థం జరిగింది. అయితే తాజాగా ఈ జంట పెళ్లి చేసుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది. కాగా వీరి పెళ్లికి సంబంధించిన ఫొటోలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు అర్మాన్. ఈ పోస్ట్‌కి 'నువ్వు నా ఇల్లు' అంటూ రాసుకొచ్చాడు. అల్లు అర్జున్ నటించిన అలా వైకుంఠపురంలో సినిమాలో బుట్ట బొమ్మ సాంగ్‌తో నేషనల్ వైడ్‌గా పాపులర్ అయ్యాడు అర్మాన్.

## కీరవాణి రాసిన పాటకు.. ఇళయరాజా మ్యూజిక్

### ఏదో.. ఏ జన్మలోదో..

రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'షష్టిపూర్తి'. క్లాసిక్ ఫిల్మ్ 'లేడీస్ టైలర్' విడుదలైన 38ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న సినిమా ఇదే కావడ విశేషం. ఇందులో రూపేష్, ఆకాంక్షసింగ్ నాయకానాయికలుగా నటిస్తున్నారు. పవన్‌ప్రభ దర్శకుడు. ఈ సినిమాలోని 'ఏదో ఏ జన్మలోదో..' అనే గీతాన్ని త్వరలో విడుదల చేయబోతున్నారు. ఇళయరాజా స్వరపరచిన ఈ గీతానికి కీరవాణి సాహిత్యాన్ని సమకూర్చడం విశేషం. దర్శకుడు ఈ పాట విశేషాలు తెలియజేస్తూ 'ఈ సినిమాలో ఐదు పాటలున్నాయి. అందులో ఓ పాటను కీరవాణితో రాయిస్తే బాగుంటుందనుకున్నాం. సందర్భం చెప్పి రాయమని రిక్వెస్ట్ చేయగా ఆయన అంగీకరించారు. ఇసైజ్ఞాని ఇళయరాజా బాణీకి ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సాహిత్యాన్ని అందించడం, అది మా సినిమాలో పాట కావడం ఆనందంగా ఉంది. కీరవాణి ఇప్పటివరకు ఎన్నో పాటలు రాశారు..కానీ ఇళయరాజా బాణీకి రాయడం ఇదే ప్రథమం. ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్లో ఉంది' అన్నారు. అచ్యుత్ కుమార్, సంజయ్ స్వరూప్, రాజ్ తిరందాసు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, నిర్మాత: రూపేష్ కుమార్ చౌదరి.






## కాంచన-4లో నాయికగా పూజాహెగ్డే

రెండేళ్లుగా మంచి విజయం కోసం నిరీక్షిస్తోంది అగ్ర కథానాయిక పూజాహెగ్డే. గత ఏడాది ఈ భామ తెరపై కనిపించలేదు. సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉండాలని నిర్ణయించుకున్నానని, అందుకే కాస్త బ్రేక్ తీసుకున్నానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. ప్రస్తుతం ఈ భామ భారీ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. తమిళంలో దళపతి విజయ్, సూర్య చిత్రాల్లో నాయికగా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నది. ఈ సినిమాలు తనకు బ్రేక్‌నిస్తాయని, నాయికగా తిరిగి పూర్వ వైభవాన్ని సొంతం చేసుకుంటానని ధీమా వ్యక్తం చేస్తోంది.

తాజాగా ఈ అమ్మడు తమిళంలో మరో బంపరాఫర్‌ను చేజిక్కించుకుంది. రాఘవ లారెన్స్ 'కాంచన4' చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటించనుందని గత కొద్దినెలలుగా వార్తలొస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఆమె దాదాపుగా ఖరారయ్యారని తెలిసింది. ఇందులో పూజాహెగ్డే డెవిల్ రోల్‌లో నటించనుందని అంటున్నారు. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com